నమ్మలేని నిజాలు

మత్తు మగువ
మకారాల మహిమ
జాగ్రత్త సుమ.

భావి భారతం
విశ్వమానవ జన
శాంతి ప్రవాహం.

సారా సరసం
విరహపు సు రసం
వంట్లో నీరసం.

మారణ కాండ
పసిపాపల గోడు
పాలస్తీనా బీడు.

కోవెల్ల రద్దీ
ఉత్తరాయణ కాలం
పంట ఇండ్లకు.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

ఆకసాన్ని చూసేందుకు
ఆసిఫాబాదు వచ్చాం !
పగలు కూడ కనిపించే
చుక్కల్ని చూసి మెచ్చాం !
ఆసిఫాబాద్ అనగానె
అదే కుమ్రంభీం జిల్ల !
ఆదిలాబాద్ అడవుల్ని
అంటించిన అగ్గిపుల్ల !

శ్రీనిజాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ బుధవారం 18-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:170 పేజీలు:6 వెల: రూ.1/-


## గవర్నర్ ప్రసంగంపై వేడెక్కిన అసెంబ్లీ
# ఆరు గ్యారంటీలను తుంగలో తొక్కారు..
### సభలో కేటీఆర్ వర్సెస్ మంత్రులు

హైదరాబాద్, మార్చి 17: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'పెన్షన్ పెంచనందుకు ధన్యవాదాలు చెప్పాలా.. నిరుద్యోగ భృతి ఇవ్వనందుకు ధన్యవాదాలు చెప్పాలా.. ఉద్యోగులను మోసం చేసినందుకు ధన్యవాదాలు చెప్పాలా. ఎందుకు ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలి' అని కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రులు కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

**కేటీఆర్‌కు కోమటిరెడ్డి కౌంటర్**

కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి' అని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దీటైన జవాబిచ్చారు.

**కేటీఆర్‌పై డిప్యూటీ సీఎం ఫైర్**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజక వర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తు న్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వకుండా వదల్లేదు. మూడు ఎకరాలు ఇస్తామని ఇవ్వకుండా వదిలేయలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు. మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే ఈ పనులన్నీ చేస్తున్నాం' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్నట్టుగా పాలన: కేటీఆర్**

సీఎం తొలి సంతకం పెట్టిన ఫైలుకే దిక్కులేదని, ఇంకా ఈ ప్రభుత్వం మాటలు ఎవరు నమ్ముతారని కేటీఆర్ విమర్శించారు. 'మహాలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబానికి రెండున్నర లక్షలు ఇస్తామన్నారు.. ఇచ్చారా' అని ప్రశ్నించారు. ఈ రెండున్నర సంవత్సరాలు ప్రజలకు పరిహాస నామ సంవత్సరంగానే మిగిలిందని ఎద్దేవా చేశారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్నట్లుగా రెండేళ్ల పాలన సాగిందన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోటీ 85 లక్షల దరఖాస్తులు పెట్టుకున్నారని.. ఎక్కడికి పోయాయి ఆ దరఖాస్తులు అని ప్రశ్నిస్తూ.. గల్లంతయ్యాయా అంటూ కేటీఆర్ నిలదీశారు. టీ 20 మాదిరిగా 420 పోటీలు పెడితే ఈ ప్రభుత్వమే గెలుస్తుందంటూ మాజీ మంత్రి సెటైర్ విసిరారు. సీఎం తీరు ఎన్నికల ముందు దానకర్ణ.. ఆ తర్వాత కుంభకర్ణలా మారిందన్నారు. అట్టర్ ఫ్లాప్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటోందని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్‌ది ఊకదంపుడు ఉపన్యాసం: మంత్రి శ్రీధర్ బాబు**

ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఫ్లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

**ఢిల్లీకి వెళ్తే నిధుల తెస్తారనుకున్నాం: కేటీఆర్**

మంత్రి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. 'మీరు ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా మాకు అభ్యంతరం లేదు. మీరు ఢిల్లీకి పోతే నిధులు తెస్తారని అనుకున్నాం. కానీ మీరు ఢిల్లీకి వెళ్లి నిధులు ఇచ్చేసి వస్తున్నారు. రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎక్స్‌పోర్ట్స్ అని మంత్రి బయట చెప్పారు. కానీ గవర్నర్ ప్రసంగంలో రూ.7 వేల కోట్లు తగ్గాయని చెప్పారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, మార్చి 17: రంగారెడ్డి జిల్లా మొయి నాబాద్‌లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ వ్యవహారంపై సిట్ విచారణ చేయనుంది. దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై సిట్ విచారణ జరపనుంది.

ఈ డ్రగ్స్ కేసులో వీటిని ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు.. ఈ పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు ఎవరు.. వారికి మీకు ఉన్నా లింకులు, దుబాయ్ లింకులు తదితర అంశాలపై పలు కోణాల్లో విషయాలను రాబట్టేందుకు ఈ సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిం ది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి ప్రభుత్వా నికి సిట్ నివేదికను అందిం చనుంది.

మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌పై ఆదివారం పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ.. కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. వారిలో పలువురికి పాజిటివ్ వచ్చింది.

వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సైతం ఉన్నారు. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరికి వారి వారి పార్టీల నుంచి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలంటూ వారికి ఆయా పార్టీలు స్పష్టం చేశాయి. అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాయి.

## ఓంకార్ గొప్ప నాయకుడు.. ఆయన సేవలు మరువలేనివి: మంత్రి సీతక్క



హైదరాబాద్, మార్చి 17: రవీంద్ర భారతిలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లా డుతూ.. ఓంకార్ ఉన్నత విలు వలు కలిగిన నాయకుడని, ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర విశేషమని గుర్తుచేశారు. అండర్ గ్రౌండ్ నుంచి ఓవర్ గ్రౌండ్ వరకు ఆయన సాగించిన పోరాటం అపార అనుభవాన్ని అందించిందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కూడా ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు.

ఉద్యమాలు, క్రమశిక్షణ, ప్రజాసేవ వంటి విలువలను ఓంకార్ నుంచి నేర్చుకున్నానని సీతక్క వెల్లడించారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన ఆయనలేని లోటు నర్సంపేటకే కాకుండా యావత్ తెలంగాణకే తీరని లోటుగా మిగిలిందని అన్నారు. 6 దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చట్టసభల్లో గళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడిగా ఓంకార్ నిలిచారని చెప్పారు. అలాంటి గొప్ప నాయకుడి చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు.


**ట్యాంక్‌బండ్‌పై ఓంకార్ విగ్రహం..**

సురవరం ప్రతాప్ రెడ్డి, గద్దర్, అందెశ్రీ వంటి ప్రముఖుల చరిత్రను ప్రజలకు తెలియ చేస్తున్నామని, అదే విధంగా ఓంకార్ సేవలను కూడా రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని మంత్రి తెలిపారు. అలాగే ట్యాంక బండ్‌పై ఓంకార్ విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కోరుతున్నారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

**యుద్ధోన్మాదాన్ని ఖండించాలి..**

ఈ క్రమంలోనే అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. ఒక దేశాధినేతను హతమార్చే హక్కు అమెరికాకు ఎవరిచ్చారని ప్రశ్నించారామె. ఇరాన్ మీద దాడిని కూడా ఖండించలేని పరిస్థితుల్లో మన దేశ ప్రభుత్వం ఉందని విమర్శలు గుప్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం మౌనం వహించడం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వం అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు.

## డా॥ నందిని సిధారెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



హైదరాబాద్, మార్చి 17: ప్రముఖ కవి, రచయిత , విమర్శకుడు డా॥ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నందిని సిధారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా మహమ్మారి కాలంలో మానవాళి ఎదుర్కొన్న సంక్షోభాలను మానవ సంబంధాల విచ్ఛిన్నతలను **'అన్వేష'** కవితా సంపుటిలో హృద్యంగా తెలియజేసిన మానవతావాది సిధారెడ్డి అని సీఎం పేర్కొన్నారు.

## ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి..
# 400 మంది మృతి

న్యూఢిల్లీ, మార్చి 17: అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ విరుచుకుపడింది. కాబూల్‌లోని ఓ ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడింది. ఈ ఘటనలో కనీసం 400 మంది దుర్మరణం చెందారని.. మరో 250 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారని అఫ్గాన్ అధికారులు వెల్లడించారు.

డ్రగ్స్‌కు బానిసలైన వారికి చికిత్స అందించే ఓ ఆస్పత్రిపై పాక్ దాడులు జరిపిందని ఆఫ్ఘానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఫ్గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఫ్ఘానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఫ్గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఫ్ఘానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం ఉండాలి.. కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

న్యూఢిల్లీ, మార్చి 17: పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది.

మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది.

పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దత్తత తీసుకున్న పిల్లల వయసుతో సంబంధం లేకుండా తల్లులకు 12 వారాల మాతృత్వ సెలవులు మంజూరు చేయాలని స్పష్టం చేసింది.

## ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని, టాప్ కమాండర్ గొలాంరెజా హతం..?



న్యూఢిల్లీ, మార్చి 17: ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానిని హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. సోమవారం రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో లారిజాని మరణించాడని ఇజ్రాయెల్ డిఫెన్స్ మినిస్టర్ ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. ఈ దాడిలో లారిజానితోపాటు ఇరాన్ టాప్ కమాండర్ గోలాంరెజా సోలేమని కూడా మరణించినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. అయితే, ఈ విషయంపై ఇరాన్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు.

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని అంతమైన తర్వాత కూడా అమెరికా, ఇజ్రాయెల్ దళాలపై ఇరాన్ గట్టిగా పోరాడుతోంది. ఈ పోరాటం వెనుక ఉన్నది మాత్రం ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని అని ఇజ్రాయెల్ విశ్వాసం. ఆయన ఆధ్వర్యంలోనే ఇరాన్ పోరాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిపింది. ఇటీవల లారిజన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు కూడా వార్నింగ్ ఇచ్చాడు. ట్రంప్‌ను అంతం చేస్తానన్నాడు. అయితే, ఆయనెవరో కూడా తనకు తెలియదని ట్రంప్ అన్నాడు. మరోవైపు ముస్లిం దేశాలు తమకు మద్దతుగా నిలవకపోవడంపై లారిజన్ ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇరాన్ సైన్యాన్ని దాడుల్ని లారిజాని పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఖమేనీ హతమవ్వడం, ఆయన తనయుడు మొజ్తాబా గురించి స్పష్టత లేకపోవడంతో ప్రస్తుతం ఇరాన్‌లో లారిజాని నెం.2 స్థానంలో ఉన్నాడు. ఒకపక్క లారిజాని మరణించాడని ఇజ్రాయెల్ చెబుతుంటే ఆయనకు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలో ఒక చేతిరాతతో కూడిన పోస్ట్ వెలువడింది. లారిజాని ఖమేనికి అత్యంత సన్నిహితుడు. ఇటీవల అమెరికాతో జరిపిన అణు చర్చల్లో కూడా అతడు కీలక పాత్ర పోషించాడు. అతడిని ఇరాన్ ప్రజలు కెన్నడీ ఆఫ్ ఇరాన్‌గా పిలుస్తారు.

## త్రివిధ దళాల ఆయుధ శక్తిగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు

దేశ రక్షణలో అహరహం తలమునకలైన త్రివిధ దళాలు భారతీయ ఆర్మీ, ఏయిర్ ఫోర్స్, నావికా బలగాలకు ఆయుధ శక్తిని నింపుతున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు గత రెండు శతాబ్దాలకు పైగా అవిశ్రాంత అమూల్య సేవలను అందిస్తున్నాయి. మన దేశ త్రివిధ దళాలకు అవసరమయ్యే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే ప్రభుత్వ రక్షణ రంగ సంస్థగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు అమూల్య సేవలను అందిస్తున్నాయి. భారత దేశ త్రివిధ సాయుధ దళాల వెనుక ఆయుధ శక్తిగా తన విశిష్టతలను ప్రదర్శిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల చరిత్ర చాలా గొప్పది. వలసపాలకుల కాలంలో 18 మార్చి 1801న తొలి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కలకత్తా సమీపాన కాస్సిపోర్ ప్రాంతంలో నెలకొల్పడం జరగడంతో ఆ చారిత్రాత్మక సన్నివేశానికి గుర్తుగా ప్రతి ఏట 18 మార్చిన దేశ త్రివిధ దళాలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డులు సంయుక్తంగా "ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవం"ను ఘనంగా జరుపుకోవడం కొనసాగుతున్నది.

**భారతీయ రక్షణ రంగంలో 4వ దళం - ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు:**

మన త్రివిధ దళాలకు దీటుగా 4వ సాయుధ బలగంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు విశిష్ట సేవలను అందిస్తున్నాయి. కాలానుగుణంగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జీర్ణించుకుంటూ వివిధ రకాలైన ఆయుధాలు, మందు గుండు సామాగ్రి, రక్షణ రంగ వాహనాల రూపకల్పన, సిబ్బంది ప్రత్యేక దుస్తుల తయారీ, పర్వత ప్రాంత రవాణాకు సంబంధించిన ఉపకరణాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మన దేశ అవసరాలకు అనుగుణంగా తయారు చేసి సమయానికి అందిస్తూ దేశ రక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సిబ్బంది సేవలను గుర్తించడం, దేశ రక్షణలో అమరత్వం పొందిన యోధులను స్మరించుకోవడం, అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన, ఆధునిక పరిశోధనా ఫలితాల మూట విప్పడం, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సేవకు సంబంధించిన ఫోటో ప్రదర్శనలు, పరెడ్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. దేశవ్యాప్తంగా 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు 24 ప్రాంతాల్లో స్థాపించడంతో పాటు 9 శిక్షణ కేంద్రాలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రాలు, 4 ప్రాంతీయ భద్రత కార్యాలయాలు 5 ఆపరేషనల్ విభాగాలుగా విస్తరించి ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 10, యూపీలో 09, ఎంపీ/తమిళనాడుల్లో 06 చొప్పున ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు స్థాపించడం జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధం నుంచి నిన్న జరిగిన ఆపరేషన్ సింధూర్ వరకు తన ప్రత్యేకతను నిలుపుకుంటూ వస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు రానున్న కాలంలో కూడా త్రివిధ దళాలకు ఆయుధ శక్తిని అందిస్తూ దేశ సమగ్రత, సమైతలను కాపాడటంలో తనదైన పాత్రను పోషిస్తున్నది. భారత మాత సేవలో ప్రాణాలర్పించిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు సంబంధించిన అమరులకు ఘన నివాళులు అర్పించడం, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సైనికులకు ధైర్యంగా నిలవడం మన కనీస భాధ్యత.

జై జవాన్ - జై కిసాన్ - జై ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ జవాన్స్.

(18 మార్చి "ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవం" సందర్భంగా)



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

**చురక**

ఐదు రాష్ట్రల ఎన్నికల్లో
ఆరంభం ఇంకా పోరు
కూల్చగలదా ప్రతిపక్షుల
కాషాయం తంత్ర జోరు
క్షేత్ర బలం ఉంటే తప్ప
కొట్లాటలో నిలువలేరు
పైనేతల చరిష్మాల
ప్రభావంతో గెలువలేరు



-వేల్పుల నారాయణ
9440433475


**రాధశ్రీ రాగాలు**

అరులకు పరాభవము
సిరులకును వైభవము
తెచ్చును "పరాభవము"
అనును రాధశ్రీ
క్రొత్త సంవత్సరము
తొలగించు మత్సరము
వెలిగించు మానసము
అనును రాధశ్రీ



-రాధశ్రీ
సెల్:9494481210


49 కిన్నెర




ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగాన సభ
ఉదయ సాహితి, తెలంగాణ
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ కవి, రచయిత, పూర్వ ఉపకులపతి
శాతవాహన విశ్వ విద్యాలయం
ఆచార్య కడారు వీరారెడ్డి గారి
లోకాలోకనం వ్యాస సంపుటి
ఆవిష్కరణ సభ
తేదీ: 22-03-2026 ఆదివారం ఉదయం 10.00 గంటలకు
లలిత కళా వేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ సుద్దాల అశోక్ తేజ
ప్రసిద్ధ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయకవి పురస్కార గ్రహీత
సభాధ్యక్షులు : శ్రీ దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ
విశిష్ట అతిథులు : శ్రీ కళా జనార్ధనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
శ్రీ బైస దేవదాసు సంపాదకులు, నేటి నిజం
గౌరవఅతిథి : ఆచార్య మసన చెన్నప్ప, ప్రసిద్ధ సాహితీ వేత్త
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి : శ్రీ మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ కవి, టి.వి., సినీ గేయ కవి

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
శ్రీమతి కళా శారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

## సప్త పదులు

రథుడు
అతిరథుడు
యుద్ధనైపుణ్యంలో
ఒక్కొక్కరిది
ఒక్కొక్కమెట్టు
అధికుడే
మహారథుడు.
-డా.గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

మత్తు
చిత్తు
మనిషి మద్యానికి
బానిసై
పోగొట్టుకున్నాడు
సొత్తు.
-రామాయణం దుర్గా ప్రసాద్.
ఉదయగిరి.

రంధి
సంధి
ప్రపంచదేశాలకు
20శాతం
ఈరవాణామార్గం
నుంచిజరుగుతుంది
హార్మోజ్ జలసంధి
-అడ్డా సత్యవేణి
9494178223

## సప్త పదులు

అండగా
దండగా
ఇతరులకు
నువ్వు
భారమై
కాకూడదెన్నడూ
గుదిబండగా..
-ఋష్యశృంగు ధిల్లేశ్వరరావు
9490904976

జాడ
నీడ
జీవితంలో
ముందుకు
నడిపించేది
తల్లిదండ్రుల
అడుగుజాడ.... !!
-శ్రీమతి భారతీకృష్ణ
99599 65215.

వంట
మంట
యుద్ధభయంతో
పెరిగిన
సహజవాయువుల
ధరలతో
ఇంటింటా తంటా.
-సొట్టుభవానీదేవి
వింజమూరు

# మనిషి జీవితాన్ని వ్యక్తీకరించిన అక్షరం-సిధారెడ్డి కవిత్వం



- డా॥పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

"కవిత్వం వేడుక కాదు, గాయాల గొంతుక "అంటూ కవిత్వానికి సరికొత్త నిర్వచనాన్ని సత్ ప్రమాణంగా అందించిన కవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి గారు .కవిత్వం నిర్వహించాల్సిన బాధ్యతను విశ దపరుస్తారు .ఇందుకు ఆయన అనుభవించిన జీవితమే నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. పుట్టిందిఅచ్చమైన పల్లెటూరులో. స్వయాన తన తండ్రి రైతాంగ సాయుధ పోరాట యోధుడు .స్వాతంత్ర్య సమరశీల శూరుడు. జీవితంలో మడమ తిప్పని కార్యసాధకుడు. రెక్కలు ముక్కలు చేసుకొని కుటుంబ పోషణలో జీవితాన్ని ధారపోసిన కన్నతల్లి కష్టం మరోవైపు. . తల్లిదండ్రుల చెమట విలువలను గుర్తించిన మానవీయ కోణం

సిధారెడ్డి గారిది. రజాకారుల దురాగతాలను, జమిందారుల దుశ్చర్యలను, ఆనాటి సాంఘిక పరిస్థితులను పెద్దలు చెబుతుంటే ఆసక్తిగా విని ప్రసి ప్రాయంలోనే ఉద్రిక్తమవడం మొదలుపెట్టారు .ఆలోచనలు కూడా అలాగే సాగించేవారు. అక్షరాన్ని కేవలం పలక మీదనే కాదు ,హృదయ ఫలకం మీద ప్రజ్వలన రూపంలో దిద్దుకున్నారు. ఆ అక్షరమే అన్నింటికీ సాధన అని నమ్మారు. సమాధానమని కూడా విశ్వసించారు. ఈ అక్షరమే కవిత్వాక్షరమని నమ్మారు. ఆ కవితాక్షర గవాక్షం నుంచి తాను చూస్తున్న ప్రపంచం బహిరంతరాలు మరింత విస్తృత రూపంలో కనిపిస్తూ వచ్చాయి. చుట్టేసిన చిక్కుముడులను, కాటేసిన అహంభావాలను విప్పే పరికరం కవిత్వరూపంలో దొరికిందని బలంగా నమ్ముతూ వచ్చారు. ఆ సంకల్పంతోనే పయనం సాగిస్తూ వచ్చారు. ఐదు దశాబ్దాలుగా ఆయన శ్వాస ధ్యాస అంతా కవిత్వమే .

వ్యక్తిగా జీవితాన్ని అమితంగా ప్రేమించడం ఆయన ప్రత్యేకత .జీవితాన్ని మించిన సాహిత్యం లేదంటారు. ఉన్నది ఒక్క జీవితకాలమే మనిషికి .ఆ సమయంలోనే ఎన్నో జీవితపు మజిలీలను దాటుతూ ప్రయాణం సాగించి అలసటను తుడిచేసి భిన్న ప్రపంచాలను కవి చుట్టి రావాలని, ఆ ప్రస్థాన ప్రయోజనాలను చిత్రించే ప్రతిభ కవికి ఉండాలంటారు. మనిషి జీవితకాలం ఏమాత్రం సరిపోనిచోట కవిత్వం ఆ ఖాళీలను పూర్తి చేస్తుందని భావించి పలు సాహిత్య, సామాజిక ఉద్యమాలతో మమేకమవుతూ వచ్చారు. వస్తున్నారు .

> **"జీవితం పట్ల స్పష్టమైన అవగాహన, చురుకైన దృక్పథం ఉన్న కవి సిధారెడ్డి గారు. అవసరం కోసం మనసును చంపుకొని, కృత్రిమ మమకారాన్ని మమతను కొనితెచ్చుకొని , బాకాలు ఊదడం ఆయనకు నచ్చదు"**

జీవితమంటే ఎడతెగని తండ్లాట.గమ్యం ఎరుగని గమనం .నిత్య సంఘర్షణల సమాహారం. చీకటి వెలుగుల విచిత్ర కేదారం. ఆటుపోట్లమయం .పూలను ముండ్లను సమంగా భావించే దృష్టి జీవితానికి ఉండాలి. చుట్టూ ముసురుకున్న ముండ్లను సుతారంగా తప్పిస్తూ ,పువ్వులా పరిమళించాలి జీవితం.


జీవితం పట్ల స్పష్టమైన అవగాహన, చురుకైన దృక్పథం ఉన్న కవి సిధారెడ్డి గారు. అవసరం కోసం మనసును చంపుకొని, కృత్రిమ మమకారాన్ని మమతను కొనితెచ్చుకొని ,బాకాలు ఊదడం ఆయనకు నచ్చదు .జీవితం ఆదర్శ పాదు నుంచి ఎగిసి రావాలి. పచ్చగా ప్రవర్ధిల్లాలి.నలుగురు మెచ్చేదై ,సమాజానికి ఉపయోగపడేదై ఉండాలంటారు .అది నిర్వచన రూపంలో

**"ఎవరేమనుకున్నా**
**చిటికెన వేలులా జీవించలేను**
**హృదయం మార్చు ( maadchu) కొని**
**ఉత్సవ విగ్రహం ముందు ఊరేగలేను"**

అని తన ఉన్నత వ్యక్తిత్వాన్ని ఉద్ఘాటిస్తారు .చేతికి ఉన్న ఐదు వేళ్ళు సమైక్యతకు చిహ్నమే. జీవిత తాత్పర్యానికి నిదర్శనమే .కార్యసాధనా కార్య సాధన ప్రేరకమే .అయితే ప్రాధాన్యతలో వ్యత్యాసం ఉంటుంది. ఆఖరి స్థానం ససేమిరా సరిపడదు అంటారు .ఇతరుల కోసం తన మనస్సును చంపుకొని పెదవులపై ప్లాస్టిక్ నవ్వులు పూయించలేనంటారు.ఇది ఆయనకు తన జీవిత పట్ల ,వ్యక్తిత్వం పట్ల ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటిస్తుంది .

మూలవిరాట్టుకున్న విలువ ఉత్సవ విగ్రహానికి లేదని చెబుతారు .హృదయాన్ని వంచించుకొని ఊరేగింపు కోసం తనకు నచ్చని వేషం ధరించలేనంటారు .జీవితం ఆకాశం నుండి జారే నీటి బిందువులా





**ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ప్రముఖ కవి, రచయిత విమర్శకుడు, డా॥ నందిని సిధారెడ్డిగారి 'అనిమేష' కవితా సంకలనం ఎంపికైన సందర్భంగా...**

స్వచ్ఛంగా ఉండాలన్నది ఆయన అభిమతం

**"జీవితమంటే చీకటికి తలొంచటనీ కాదు**
**బట్టకట్టి మౌనంగా మరణించడం కాదు**
**వెలుక్కోసం వెతుకులాట**
**ప్రేమకోసం పెనుగులాట**
**మనిషి కోసం ఎడతెగని గొప్ప తండ్లాట"**

పై కవితా పంక్తుల్లో వ్యక్తిగా, కవిగా సిద్ధారెడ్డి గారి ఆశయ సాధనా తత్పరత స్పష్టంగా దర్శనమిస్తుంది.అవును ,ఆయన మనిషికి పట్టం కట్టారు .మనిషిలో మనీషకు హారతి పట్టారు. అసలు జీవితమంటే ఏమిటి ? పుట్టడం గిట్టడమేనా? దీని పరిధి ఇంతేనా ? వీటి మధ్య జరిగే సంఘర్షణ ఆనందం, ఆక్రోషం, వేదన , సంవేదన మాటేంటి? ఇంకా ప్రస్థాన దశల్లోని పలురూపాల వైఖరులు ఏమిటి? పద ఘట్టన సవ్వడి లేకుండా అమాంతం వెలుగులను చుట్టుము ట్టే చీకటి దాడుల భయానక కృత్యాల ఆంతర్యం ఏమిటి ? చీకటి వెలుగుల సయ్యాటల సంగతులు ఏమిటి? ఈ అవమానాలను అన్నింటిని మౌనంగా భరిస్తూ అడవి పూలై రాలిపోవడం సార్థక్యం ఏమిటి? ఇవన్నీ మనిషి జీవితాన్ని నిలదీసే ప్రశ్నలే .ప్రశ్న అలాగే నిలిచి ఉండొద్దు. ప్రశ్నలోని శోధకశక్తి చీకట్లను తొలగించాలి. వెలుగుల పరిపూర్ణతలో సమాధానంగా ప్రసరించాలి. **"చీకటిని తిడుతూ కూర్చోవడం కన్నా చిరుదీపం వెలిగించు"** అన్నట్టుగా వెలుగు కోసం అన్వేషించమంటారు కవి.

ఇద్దరు మనుషుల మధ్య కలుషితం అంటని నిర్మల ప్రేమ పుట్టాలంటారు .జీవితం అంటే ప్రేమ కోసం నిరంతరం జరిగే సంఘర్షణ .మనిషిని అందుకోవడానికి సాగే నిరంతర తండ్లాట .అందుకే కవి జీవితంలో ఇంత దయ ,ఇంత ప్రేమ ,ఇంత ధైర్యము లేకపోతే అది మనిషి పుటకేనా !అని మనిషిని ప్రశ్నిస్తారు .ప్రశ్నలో అతడు అందుకోవలసిన గుణాలను చూపెడతారు. ప్రశ్న నుంచి పుట్టిన సమాధానం ప్రామాణికమైన మూల్యాన్ని ఉద్ఘాటిస్తుంది కదా !

ఆత్మీయమైన మానవ సంబంధాలను మించిన సౌందర్యం ఏమీ లేదు. అయితే శ్రీశ్రీ గారు శ్రమకు మించిన సౌందర్యం లేదన్నారు .మనిషి శ్రమతో వెలగాలి .శ్రమలో పయనించాలి. శ్రమలోనే జీవితాన్ని పండించుకోవాలి.నిరంతరం శ్రమతో జీవించాలి. చెమట ఫలితంగా అంది వచ్చే ఫలాలు సమ పంపిణీ జరగాలి .సమాజం నవనవంగా ఎదగాలి .అప్పుడే ప్రపంచమంతా సౌఖ్యంతో భాసిస్తుంది. కవి సిధారెడ్డి గారికి మనిషి పట్ల ప్రగాఢ విశ్వాసం ఉంది మనిషికి మనిషికి మధ్య అనురాగ సూత్రంతో ప్రేమ అనే పూ బంతులను అల్లాలని భావిస్తారు. దండగా కుదురుకున్న ఈ అనుబంధాలను సహించలేని రాజ్యహింస ఏ పదునైన కత్తితో ఎప్పుడు ఎక్కడ పుటుక్కున తెంపి వేస్తుందో అన్న దిగులు కవిని వేధిస్తుంది .మనిషిని గుర్తించలేని ,గౌరవించలేని మానవ సంబంధాల సతత హరితంగా కాపాడుకోవాలంటే ఇంత త్యాగం అవసరమని అంటారు .ప్రేమను మించిన సౌందర్యం ఈ ప్రపంచంలో ఏదీ లేదంటారు .ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగానే మనిషి చుట్టూ విస్తరించి అల్లుకున్న జీవితం కొన్నిసార్లు ఎత్తైన శిఖరాలను ,మరికొన్నిసార్లు కనుచూపుకు అందని అగాధాలను చూడాల్సి వస్తుంది. మైదానం లాంటి జీవితం సొంతం చేసుకోవడంలో ఈ గిరులను ,లోయలను అధిగమించాల్సిందే .ప్రత్యేకంగా జీవితం కోసం ఉద్యమించాల్సిందే

.కఠోర ప్రస్థానం సాగించాల్సిందే .మనిషిని జెండాగా మలుచుకుని ముందుకు దూసుకుపోవాల్సిందే .జీవితం కోసం ప్రత్యేకించి నిఖార్సైన జీవితం కోసం ఉద్యమించాల్సిందే.కఠోర ప్రస్థానం సాగించాల్సిందే. మనిషిని జెండాగా మలచుకొని ముందుకు దూసుకు పోవాల్సిందే.తాను అనుకున్న లక్ష్యాలను సాధించడానికి సంకల్ప గమ్యం చేరడానికి.అందుకే సిద్ధారెడ్డి గారు "జీవితం కోసం, జీవితం పొడుగునా, జీవితంలోని అగ్ని కాపాడదలుచుకున్నాను "అంటూ జీవితంలోని ఆశయ సాధన అనే అగ్ని చల్లారిపోకుండా జీవితం పొడుగునా చైతన్య పూరితమైన సజీవకాంక్షలు కాపాడుతానంటారు.ఇక్కడ అగ్ని అంటే మనిషిని దహించే వస్తువు కాదు .అతని అంతరంగంలో రగులుతున్న ఆకాంక్ష .సాధనా లక్ష్యం .ఈ పోరాటంలో నరాల సత్తువ సచ్చుబడ కూడదు. దేహంలో ప్రవహించే రక్తం ఇంత ఉత్సాహం కలిగి ఉండాలి.సంకల్పం సడలి పోకూడదు.అగ్ని వెలుగుకు ప్రతీక.చీకటిని తరిమికొట్టి వెలుగు పూల తోటను నిలుపుతుంది.తెల్లని దారులు పరుస్తుంది. కళ్ళ ముందు ప్రపంచాన్ని జ్యోతిర్మయం చేస్తుంది. ఒక ఉజ్వల ఆనంద రూపాన్ని నిలుపుతుంది .అలాంటి సమాజం కోసం అన్వేషణ, తపన, సంవేదన సిధారెడ్డి గారి కవిత్వ పంక్తుల్లో స్పష్టంగా ద్యోతకమవుతుంది .

చైతన్యం చచ్చు బడని మనిషి తాను నిలుచున్న నాగేటి చాల్లల్లో నిండుగా మనిషై అంకు రిస్తాడు .పరిణామ దశల్లో వికసిస్తాడు. నిరంతరం పరిపూర్ణుడవుతాడు .జీవితం ఒక్కసారి మనల్ని పెన వేసుకున్నాక వదులుకోవడం అంత సులభమైనది కాదు. ఖాళీ చేయడం అంత కన్నా సులువైనది కాదు. అందుకే కవి

"ఇల్లు ఖాళీ చేసినంత సులభంగా జీవితం ఖాళీ చేయలేము కదా" అన్న కవితా పంక్తులు

> **"జీవితాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఎదురయ్యే అనేక అవరోధాలను అధిగమిస్తూ 'బురదలో పొర్లటమే జీవితమైతే' ఆ జీవితాన్ని వెనక్కు తోసేస్తూ ముందుకు నడవాలి అంటారు"**

భావ ప్రధానంగా నడిచాయి .మనిషి దేహం ఒక ఇల్లు వంటిది, ఇల్లు ఖాళీ చేయటం ఒకంత సులభం కావచ్చు! కానీ ,మనిషి దేహం అనబడే ఇల్లును ఖాళీ చేయటం అనుకున్న ఒత సులువు కాదంటారు కవి. నిజమే మనిషి పుట్టినప్పుడు ఒంటరిగానే పుడతాడు. క్రమ క్రమంగా మెల్లమెల్లగా ఎదుగుతాడు. ఆ వికాసం కుటుంబరూపంలో విస్తృతమవుతుంది. ఇదిగో ఇలా వస్తున్న క్రమంలో సమాజం దగ్గరవుతుంది. దాని ఎగుడు దిగుడుల రూపాలు అవగతం అవుతాయి బహిరంతరాలు ప్రశ్నిస్తాయి సమాధానాల కోసం ఓ అన్వేషణ సాగుతుంది మెల్లమెల్లగా జీవితం కోసం ఓ పెనుగులాట మొదలవుతుంది. అన్వేషణ సాగుతుంది. ఆ వలయం నుంచి దూరంగా వెళ్లలేని సంక్లిష్టత చుట్టుముట్టి ప్రశ్నిస్తుంది. జీవితాన్ని వెలిగించి గెలిపించే మార్గం అన్వేషించి మనిషి నిలబెట్టి ప్రయత్నినీ జరగాలి .అందుకే సిద్ధారెడ్డిగారు జీవితాన్ని, జీవిత పుస్తకాన్ని చాలా దగ్గరగా, సమగ్రంగా చదువుకున్నారు .చదువుకున్న ఒక్కో అక్షరాన్ని శిల్పరూపంలో భావించుకున్నారు. రక్తగతం చేసుకున్నారు. మేధలో సమన్వయించుకున్నారు. ఇప్పుడు ఆయన జీవితంలో నుంచి అంత సులభంగా వెళ్లిపోవడానికి కవిగా ఇష్టపడడం లేదు. తానే కాదు, తన చుట్టూ పరచుకున్న మనుష్య సమూహం కూడా అంతేనని భావిస్తారు. జీవితాన్ని ఒక బాధ్యతగా ఎంచుకునే వాళ్ళు ఎవ్వరూ ఉన్నపళంగా ఖాళీ చేయడానికి ఇష్టపడరు." జీవితం ఒక కావ్యం ,అది చిన్నదైనా పర్వాలేదు చక్కగా ఉంటే చాలు"అన్నట్టుగా జీవితం విలువైన ప్రయోజనాన్ని ఇచ్చేదిగా ఉండాలని భావిస్తారు .జీవిత కావ్యంలోని ప్రతి అక్షరం ,ప్రతి పదం, ప్రతిపుట అత్యంత విలువైనది. సందేశాత్మకమైనది .అయితే ,మనిషిని జీవితాన్ని ప్రేమించడమే కాదు, మనిషిలోని మరో పార్శ్వాన్ని "ఒక్క తలలోనే రెండు నాలుకల మనిషి వర్ధిల్లుతున్నాడు జాగ్రత్త "అంటూ హెచ్చరిక చేస్తారు . ఈ హెచ్చరిక కూడా మనిషిని పరిపూర్ణుడుగా నిలబెట్టే ప్రయత్నం అని మనం అనుకోవాలి . అనుకోవడం అనేది జాగ్రత్తగా ఉండాలి .అది మెలకువతో సాగాలి.

**"నిజమైన మనిషి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మనిషే**
**మనం ఆరాట పడాల్సింది గాయపడ్డ మనిషి ఆత్మ కోసం**
**నిజం మనం నిలబడాల్సింది మనిషి ప్రేమించే ప్రపంచం కోసం"** సిద్ధారెడ్డి గారు తన కవితా క్షరాలను ఆనందమయులైన పాఠకుల కోసమే కాదు, బాధాతప్తులైన పీడిత వర్గాల కోసం ప్రధానంగా ధారపోశారు .జన సౌఖ్యం కోసం పోరుబాట పట్టిన వీరుల పక్షాన వకల్తా పుచ్చుకొని ముందుకు సాగారు .గాయపడ్డ మనిషికి తన కవితాక్షరాలతో ఇంత మలాం పూసే ప్రయత్నం చేస్తున్నారు. ఓదార్పుతో ధైర్యం చెబుతున్నారు. మనిషి ఎటువైపు నిలబడాలి, ఎవరి పక్షాన వాదన వినిపించాలి, ఇలా పలు ప్రశ్నలు తనలో సంధించుకుంటే దొరికే సమాధానం ఒక్కటే .మనిషిని ప్రేమించే మనిషి వైపు నిలబడు అని ఒక్కటే జవాబు. ఇక్కడ కవి అదే భావాన్ని వ్యక్తపరుస్తున్నారు. ప్రేమ ప్రేమైక ప్రపంచ అవతరణ కోసమే ఈ తండ్లాట అంటారు .ప్రేమ ఉండడం మంచిదే కానీ, బతుకు చిత్రం తలకిందుల వుతున్నప్పుడు, మసకబారుతున్నప్పుడు తడబడుతున్నప్పుడు ఇంత తెగింపు కూడా మనిషికి అవసరమే అంటారు. మనిషి మృగ్యమవడం కన్నా విషాదం మరొకటి లేదంటారు. బతుకుచిత్రం నిటారుగా నిలుపుకున్న సమాజమే అందంగా, ఆనందంగా భాసిస్తుందంటారు .

అదొక ఉజ్వల సందేశం అవుతుంది.

"బతుకులో తీపిని పంచటానికి
కొంతచేదు మింగదల్చుకున్నాను"


జీవితం ఎప్పుడూ పూలబాట కాదు .అప్పుడప్పుడు ముండ్ల ఎదురు పడుతుంటాయి. ముండ్ల ను సుతారంగా ఏరుకుంటూ ఆశావహమైన సంకల్పంతో సుందర ప్రకృతి సీమల వైపు పదం కదపడం అంటే తీపిని సాధించడమే . చేదును కంఠాన ధరించిన పిదపే అమృతం వచ్చింది కదా !అందుకే కవి సిద్ధారెడ్డి గారు మనసుకు తగులుతున్న గాయాలను ఓర్చుకుంటూనే తనకోసం తన తోటి సమాజం కోసం కొంత చేదును మింగదలచుకున్నాను అంటున్నారు. సమాజ సౌఖ్యం పట్ల ప్రగాఢ అభిమానం మనుషుల నోటి నుంచి మాత్రమే వచ్చే మాట ఇది .అట్లా సిద్ధారెడ్డి గారు ఏడు దశాబ్దాల జీవితంలో అనేక అనుభవాలను, మలుపులను ,మజిలీలను చవిచూశారు .చీకటి వెలుగుల క్రీనీడలను వీక్షించారు నిత్యం అనూహ్యమైన సంఘర్షణ ఒకటి వేటాడుతుంది. బహుశా అది మనిషిని నిలబెట్టుకుని శ్రమ కావచ్చు ! అయితే జీవితం అచ్చంగా మనదే అయ్యుండాలంటారు .పరాయికరణ జరిగితే అది ముని వేళ్ళ నుంచి జారిపోతే నీది కానీ జీవితం గురించి ఏమీ రాయలేని అంటారు .

ఒక్క అవయవం ఏదైనా గాయపడితే అల్లాడిపోతాం. కన్నీళ్లు రాలుస్తాం. దెబ్బ తీవ్రత మనసులు చిదిమేస్తూనే ఉంటుంది. దేహాన్ని పిండేస్తూనే ఉంటుంది .అలాంటి జీవితం మొత్తం మన కళ్ళముందే బొట్లు బొట్లుగా రాలిపోతుంటే..ఆ వేదన వర్ణాతీతం .అందుకే కవి సిద్ధారెడ్డి గారు

"జీవితం కాలిన బాధ ముందు చేతులు కాలిన బాధ పెద్ద లెక్కలోనికిది కాదు" అంటారు.పై పంక్తుల్లో జీవన తాత్వికత గాఢంగా ఉంది.అర్థం చేసుకోవడంలో విస్తృతమైన విషయం కళ్ళ ముందు నిలుస్తుంది .చేతులు కాలడం అంటే శ్రమతత్వం చచ్చు పడడమే .ఇక జీవితం మొత్తం కాలడం అంటే తన కాళ్ళకింది మట్టి తనకు తెలియకుండానే జారిపోవడం అన్నమాట. ఈ అస్తిత్వపు ఆనవాళ్ళ రూపాలు క్రమేపి మసక బారడమే .అంటే సజీవ చైతన్యం చల్లారడమే. అందుకే సిద్ధారెడ్డి గారు జీవితాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఎదురయ్యే అనేక అవరోధాలను అధిగమిస్తూ 'బురదలో పొర్లటమే జీవితమైతే' ఆ జీవితాన్ని వెనక్కు తోసేస్తూ ముందుకు నడవాలి అంటారు .ఇట్లా జీవితంలోని భిన్న పార్శ్వాల తత్వాన్ని గొప్పగా వ్యక్తీకరిస్తారు సిద్ధారెడ్డి గారు. ఇది అసలు సిసలైన కవి లక్షణం కదా!

## ఎందాకా ఈ పయనం !

కవిత్వం జీవనదుల్లా ప్రవహిస్తోంది
ఎక్కడో పుట్టి కొండ కోనలు ఒరుసుకుంటూ
పల్లెల నగరాల మలినాలను
కలుపుకుంటూ పరుగులు తీస్తోంది
ఆనకట్టలు లేక సముద్రంలో కలుస్తోంది
కవిత్వం ఇప్పుడు వీధుల్లో తిరిగే అనాథ
ఎవరికి పుట్టిందో ఎవరు వదిలించుకున్నారో
తెలియని పిచ్చమ్మాయి వెతుకులాట
ఎందరెందరి ఆకలి చూపులో ఆమె మీద
ఏ చీకటి రాత్రుల్లోనో కుతి తీర్చుకున్నారు
ఇప్పుడా పిచ్చి తల్లి గర్భంతో నడుస్తోంది
ఇంకో అనాథను ప్రసవిస్తుందో
కాల గర్భంలో కలిసిపోతుందో
కవీ కవీ కవిత్వమా విన్నావా
విందామా శిశువు జననానికి
పురిటి పెను కేకలు.
కవిత్వం చచ్చింది
కథ అటకెక్కింది
నవల దిక్కు లు మార్చుకుంది
కళ్ళు తెరవండిరా దారి తప్పిన కుర్రకారా.
యు ఆర్ నాట్ మై మెంటార్
నా కథ నా నవల నా పద్యం నా ఇష్టం
హూ ఆర్ యు టూ ఆస్క్ అండ్ జడ్జ్
జర సునో భాయియో ఔర్ బెహనో
మీ యవ్వనంలో ఎన్ని ప్రేలాపనలు
మరెన్ని నగ్న గీతాలు
మరెన్ని ప్రచార హోరింతలు
మీ లొంగుబాట్ల చిట్టా లెక్కడ
ఎన్ని అస్తి పంజరాల మీద నడకలు
ఒక పశ్చాత్తాప ప్రకటనతో పునీతులయ్యారా
లక్షల కోట్ల అవినీతి సంపాదనలో
దేవుడికి వాటా సమర్పించి
లెంపలేసుకునే నాస్తిక భక్తుడూ
పులు కడిగిన ముత్యమేగా !
నీకు పట్టిన కీర్తి నీకు వచ్చిన ఐడెంటిటీ
నువ్వు వేసిన మద్య ప్రేరేపిత చిందులు
కవిత్వానివేగా పాటవేగా
ఏమిలేని రోజుల్లో ఎన్నెన్ని త్యాగాలు
ఇప్పుడెందు కింత భ్రష్టత్వం
నిలువెల్లా అణువణువూ పుచ్చిపోయిన
నీ సవాలక్ష బలహీనతలు
ఎవరినీ ఏ దిశకు నడిపించలేవు
నీ జననం కతేంటోగాని
నీ మరణం కూడా సంవత్సరీకాలు
పెడుతూనే వుంటుంది.
ఇంత లెక్కలేని తనం ఎలా వచ్చింది
ఇంత సిగ్గుపడని తనం ఎప్పుడొచ్చింది
రాజకీయానికి సృజనకు మధ్య
గీతలు చెరిపింది ఎవరు?
ప్రతి నిమిషం ఆత్మ హననం చేసుకుంటూ
ఎందాకా నీ పయనం!.
ఇప్పుడు ప్రశ్నలు వినిపించవు
బధిరులం కాకపోయినా
ఇక్కడ సమాధానాలు నిషిద్ధం.
నిన్నటి వాడైనా నేటి వాడైనా
ఒకే నినాదం
ప్రపంచం దివ్యంగా వెలిగిపోతోంది
తరిస్తారా శలభాల్లా మాడిపోతారా
ఆప్‌కీ మర్జీ !.



-పి చంద్రశేఖర అజాద్
ఫోన్: 92465 73575

## యుద్ధ విరమణే మిగిలిన మానవ కర్తవ్యం

మానవ జీవితంలో
నిరంతరం యుద్ధం జరుగుతూ ఉంటుంది
ఎదగడం కోసం కొన్ని సార్లు
ఎదుటి వాణ్ణి ఎత్తెయ్యడం కోసం అన్నిసార్లు
ఒక్క మాటతో యుద్ధాన్ని రాజేశాక
చనిపోయే వాళ్ళలో నీ సైనికుడూ ఉంటాడు
యుద్ధమెప్పుడూ హననమే
ఎన్ని దోసిళ్ళతో తాగినా
రక్తంతో దాహమెప్పుడూ తీరదు
రహదారులన్నీ ధ్వంసమై
రాకపోకలు లేకుండా చేస్తాయి
మిస్సైల్లు చేసిన రంధ్రాలు అన్ని ఇండ్లను
సమాధులుగా మారుస్తాయి
పండిన పంట పొలం పొడారిపోయి
ఇక ఎన్నడూ ఆకలి తీర్చదు
మనిషేమో చచ్చుపడిపోయి
లేపినా లేవకుండా చచ్చిపడిపోతాడు
మిగిలిన చిన్నాచితకా జనం
చుట్టూ జరిగిన విధ్వంసంలో నుండి
ఏరుకున్నా
దొరకని మెతుకుల కోసం ఎగబడతారు
ఇప్పుడు యుద్ధాలు ద్వంద్వం కావు
తలో చెయ్యి వేసి ప్రకృతిని మానవత్వాన్ని
తగలెయ్యటమే
లేదూ...
గడ్డివాము తగలబడుతుంటే
బీడీ వెలిగించుకోవడం కోసం
నిప్పుకై చూడటమే
అనంతానంత కాలం గీసిన రేఖపై
మనిషి ప్రయాణమెప్పుడూ
ఒక బిందువంత కాదు
సముద్రంలోంచి తీసిన ఒక చుక్క నీరు కాదు
యుద్ధమంటే
నదులన్నిటీ తీసుకెళ్లి సముద్రంలో కలపటమే
ఎంత తాగుదామనుకున్నా ఒక్క చుక్క కూడా
తాగలేనంత
ఉప్పదనమై మిగులుతుంది
విధ్వంసానిదేముంది
ఇంటిని బుల్డోజర్ తో
పడగొట్టడమంత సులువు
తలో చెయ్యి వేసి కూల్చేస్తారు
మళ్లీ కట్టడమే ఎవ్వడూ చెయ్యలేనిది
అందర్నీ చంపేశాక
నీతో కలిసుండటానికి
ఎవరు మిగులుతారు?
కాలిన శవాల చుట్టూ
తల్లి చనుబాలకై వెతుకుతూ
ఏడ్చి ఏడ్చి విషమైపోయిన గాలిని పీల్చి
శిశువు చచ్చిపోయి మిగులుతుంది
వేళ్ళు తెగి ఒకడు కాళ్ళు విరిగి ఒకడు
కన్నులో మిస్సైల్ ముక్క గుచ్చుకొని ఒకడు
యుద్ధంలో పేలిపోయిన తాలూకు శరీరం
ముక్క
రహదారి ధ్వంసమై మిగిలిన గులకరాయి
ముక్క
ఒకదానికెదురుగా ఒకటి పడి
ఆ రెండింటిపై గుచ్చుకున్న తుపాకీ కొన
విధ్వంసానికి ఆనవాళ్ళుగా మిగిలిపోతాయి
నాయనా!
యుద్ధమెప్పుడూ దాహం తీర్చదు
నీకైనా నాకైనా ఎవరికైనా ఎప్పటికైనా
తగలబెడితే తగలబడితే
పూసేది పూలతోట కాదు
ఫిరంగుల్ని పూయిద్దామనుకుంటే
పిచ్చి వాడా...
వాటికి జాలి స్పర్శ అస్సలుండదు
ఇప్పుడు మనం చేస్తున్నది
చేతిని తెగ్గోసుకుని అతికించడానికి
ప్రయత్నం
యుద్ధంలో ఎదుటి వాడి తలతెగినా
నీకు చేయి పోయి జీవితాంతం ఒంటిచేత్తో
మైల కడుక్కోవాల్సి వస్తుంది
క్షణక్షణం నిన్ను తొడేస్తూ
విధ్వంస విన్యాసాన్ని కళ్ళకు కనపడచేస్తూ
వుంటుంది
ఎదురుగా సమాధులపై నీవు పూయించాలి
అనుకున్న పూల తోట
కాలిన కమురువాసన వేస్తూ
ముక్కుపుటాలను అదరగొడుతుంది
యుద్ధంలో ఎప్పటికీ సమయం
మించిపోవడం ఉండదు
ప్రపంచానికి చివరిప్రాణి
మిగలటం కోసమైనా
యుద్ధాయుధపు ఇనుప హృదయంలోంచి
మానవత్వ పరిమళపు పుష్పం పూయించాలి
ఒక చిన్న మొక్కగా మొలిచి
రేపటి సూర్యోదయాన్ని చూయించాలి
ఆ వైపుకి ఆలోచనల రహదారుల్ని వేసి
ఆచరణశీల ప్రయత్నం చేద్దాం
ప్రపంచం కాలిపోతుంటే
ఏ అర్ధరాత్రో నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి
అందరిలోకి మానవత్వపు మెలకువను
విస్తరింపజేయటమే కదా జీవితాన్ని
జీవించడం అంటే



-జి.నరసింహస్వామి
9441041475.

## యుద్ధ విధ్వంసం ఆపండి

యుద్ధాలు ఆపకపోతే
పరిస్థితి దిగజారుతోంది!
బ్లాక్ మార్కెటింగ్ దందాలు
పెరిగిపోతాయి!
సామాన్యుల బతుకుదెరువు
చిద్రం అవుతుంది!.
ఒకరిమీద మరొకరు
దాడి చేసుకోవడం!
మానవుడు సాధించిన
ప్రగతిని విధ్వంసానికి
వినియోగించడం !
అనాగరికం కాక ఏమౌతుంది
ప్రపంచం శాంతియుతంగా
ఉంటేనే ఎవరి బతుకులు
వాళ్ళు బతుకుతారు!
యుద్ధంలో విజయం సాధించడం
అంటే ఎంత
మందిని చంపాం అనేదే గదా
మీ లెక్కలు! ఇది వికృతం,రాక్షసానందం!
జరిగిన నష్టాన్ని,పోయిన మనుషుల్ని తిరిగి
తీసుకురావడం మీ వల్ల కాదు కానీ..
ఇప్పటికైనా యుద్ధాన్ని విరమించండి!
మనుషుల్ని చంపుకుంటూ
మానవుడు నిర్మించిన
మహోన్నత ఆకాశ హర్మ్యాలు
నేలమట్టం చేస్తూ
ఆనందించడం.. వికృతం!
పైశాచికత్వం!
ప్రపంచీకరణ అంటే
మనిషి సాధించిన విజ్ఞానాన్ని
వాటి ఫలాలను ఇచ్చి పుచ్చుకోవడం గాని
ప్రపంచాన్ని అగాధంలోకి నెట్టడం కాదు!
ప్రపంచాన్ని శ్మశానంగా మార్చి
ఒక్కడివే ఊరేగుతానంటే
చూసేవాడు లేకపోతే
నీకూ ఎలావుంటుంది!
దేనికోసం మీ పెత్తనం,
ఎవరికోసం మీ ఆధిపత్యం!
ఆపండి!
మానవ సమాజాన్ని నిర్మూలించే ఈ
యుద్ధాలను ఆపండి!
చర్చలు జరిపి శాంతిని
పునరుద్ధరించండి!!!!



-డా॥ దాశరథుల నర్సయ్య
9390919100




# అనుభవాల గోపురం..
# ఆచార్య కదారు "లోకాలోకనం!"

వృత్తిరీత్యా ఉస్మానియా విశ్వ విద్యాలయం రసాయన శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు.. పూర్వ ఉపకులపతి, శాతవాహన విశ్వ విద్యాలయం.. ఆచార్య కదారు వీరారెడ్డి గారు 2014లో రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచు కుని.. ప్రతిభావంతంగా సాహిత్య సృజన చేయడం ప్రశంసనీయం. వివిధ ప్రక్రియల్లో పదేహేడు గ్రంథాలను వెలువరించి.. ఓ సాహితీవేత్తగా తమకంటూ సాహితీ క్షేత్రంలో ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్నారు. కవిత్వంతో పాటు కథలు, వ్యాసా లు, దీర్ఘ కవితలో రాసిన అనుభవమున్న ఆచార్య కదారుగారు తమ విశ్రాంత జీవితాన్ని సాహిత్య సృజనకే అంకితం చేయడం స్వాగతించదగింది. ఆచార్య కదారు గారు రాసిన **"భాస్వరాలు", "కాలం అడుగులు",** కవితా సంపుటులు హిందీ భాషలోకి అనువదింప బడటం విశేషం.. వారి రచనలపై **"ప్రతిభా స్వరాలు"** దాస్యం సేనాధిపతి, 'వీరారెడ్డి సాహిత్య దీప్తి' కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి వెలువరించారు. దాదాపు మూడున్నర దశాబ్దాలు యు.జి.పి.జీ విద్యార్థులకు రసాయన శాస్త్రాన్ని బోధించ డమే కాక, 33 సంవత్సరాలు పరిశోధన చేసి 8 గ్రంథాలను అంతర్జాతీయ స్థాయిలో రసాయన శాస్త్ర విభాగంలో వెలువరించారు. 16 అంతర్జా తీయ, 5 జాతీయ స్థాయి సదస్సుల్లో పత్ర సమర్పణ చేయడం విశేషం! ఆచార్య కదారు గారు ఆరుగురు విద్యార్థులకు పి.హెచ్.డి. గైడ్‌గా వ్యవహరించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో విశిష్ట పదవులను అలంకరించడంతో పాటు శాతవా హన విశ్వవిద్యాలయం ఉపకులపతి గా, కాకతీయ, తెలంగాణ విశ్వ విద్యాలయాలకు ఇన్‌చార్జి ఉపకులపతిగా సేవలందించి.. ప్రశాసనంలో అనేక సంస్కరణలు తెచ్చారు. ఇంతటి అనుభవమున్న ఆచార్య కదారు గారు "లోకాలోకనం" పేరుతో **'కదారు వ్యాసావళి'**ని వెలువరించారు. ఆచార్య కదారు గారు తమ అపార అను భవాన్ని రంగరించి, తమ లోక పరిశీలనను మేళవించి, తమ విజ్ఞాన సారాన్ని జోడించి.. తమ సృజనాత్మక సుగంధ తిలకాన్ని అద్ది, సాహిత్య పరిమళాలను గుబాళింపజేస్తూ.. **'లోకాలోకనం'** వ్యాసాలను రూపు దిద్దారు. **"అనుభవాల గోపురంగా"** మలచ బడిన ఈ వ్యాస సంపుటిలోని 21 వ్యాసాలు దేనికదే సాటిగా, కొలువుదీరాయి. ఆచార్య కదారు గారి రచనా వైచిత్రికి అద్దం పట్టే విధంగా.. పాఠకుని మది గదిలో.. (పాఠకుని) వ్యక్తిగత ఆలోచనలు, అనుభవాలు, అనుభూతులు ప్రతిబింబించేలా.. ఇందలి రచనా కొనసాగడం అభినందనీయం. రచయిత ఆచార్య కదారు గారు ఈ గ్రంథంలో పొందు పరిచిన వ్యాసాలు సాంద్రత పొదిగిన సంక్షిప్త రచనలుగా కాన వస్తాయి. పాఠకుల ను ఇట్టే ఆకట్టు కుంటాయి. ఏక బిగిన చదివిస్తాయి. వ్యాసాన్ని ఓ వార్తలా కాకుండా వ్యాసంగానే తీర్చి దిద్దడంలో కదారుగారు చూపిన చొరవ, శ్రద్ధ కడు ప్రశంసనీయంగా ఉండటం స్వాగతిం చదగింది. ఆచార్య కదారు గారి లోతైన పరిశీలనాశక్తి.. అంతర్లోకాన్ని అవగాహన చేసు కునే ఆయన యుక్తి.. సమాజాన్ని జాగృత పరిచే చైతన్యదీప్తి... వంటి సుగుణాలు ఇందలి వ్యాసాల్లో అడుగడుగునా మనకు తారస పడతాయి. రచయిత ఆచార్య కదారుగారు తమకు తాము ప్రతిష్ఠించుకున్న 'లోకాన్ని' ఆయన అంతరంగంలో కొలువు దీరిన **"అలోకాన్ని"** పది మందికి తెలియ జెప్పే గొప్ప సంకల్పంతో రాసిన ఇందలి వ్యాసాలున్నాయి. మనం చూసేదే లోకం కాదనీ.. చూడనిది అనంతమని తేల్చి చెప్పా రు. సమాజం పట్ల ఆయన కున్న దృక్పథాన్ని, మంచి చెడుల పట్ల ఆయనకున్న విచక్షణా పటి మను ఇందలి వ్యాసాల్లో మనం గమని స్తాం.. ఆచార్య కదారుగారు స్వయంగా కవి కనుక.. ఆయన సందర్భోచితంగా, ఔచిత్య వంతం గా ప్రయోగించిన పదబంధాలు ఈ వ్యాసాలకు శోభను కూర్చడమేగాక.. పుష్టినిచ్చాయి. ఈ వ్యాసావళి కోసం ఆచార్య కదారు గారు ఎంపిక చేసుకున్న వస్తువులు.. అందరికీ ఉపయుక్తంగా.. ఉండే విధంగా ఉన్నాయి. పాఠకులను చైతన్య పరచడంతో పాటు..ఓ గొప్ప అనుభూతిని పంచేలా రచయిత తీసుకున్న శ్రద్ధ అభినందనీయం. ఇక వ్యాసాలను పరిశీలించడానికి లోపలికి వెళితే.. **"దీర్ఘాయుష్మానుభవ"** వ్యాసంలో నూరు అనేది ఓ సంఖ్యనే కావచ్చు.. కానీ అది మొట్ట మొదటి మూడంకెల సంఖ్యగా దానికున్న ప్రాశస్త్యాన్ని విడమరిచి చెప్పారు. చాలా ఏళ్లు బ్రతకాలని అందరికీ ఉంటుంది. కానీ చివరి దాకా ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలో చక్కగా వివరించారు. వయసు పెరుగుతుందనే ఆందోళన వద్దనీ.. అరవై దాటాయి. వయసు మీద పడుతోందనీ.. కాళ్లూ చేతులూ ఆడించే శక్తి తగ్గిపోతుందనే అపోహ వద్దని సూచించారు. మానసిక స్థైర్యాన్ని కోల్పోవడమే సగం అనర్థమనీ గ్రహిస్తే.. ఒత్తిడికి దూరమవుతామని తెలియజెప్పారు. ఫలితంగా ఇలా గ్రహించే వారికి ఆరోగ్యంతో పాటు ఆయుష్షు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ఆరోగ్యం, స్థిమితం శరీరానికే కాదు మనసుకు కూడా అత్యవసర మని తేల్చి చెప్పారు.

**ఆచార్య కదారు వీరారెడ్డి గారు 2014లో రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచు కుని.. ప్రతిభావంతంగా సాహిత్య సృజన చేయడం ప్రశంసనీయం.**

**"పుస్తకం కావాలి హస్త భూషణం మళ్లీ!"** వ్యాసంలో పుస్తక పఠనం ఆవశ్యకత, వైశిష్ట్యాన్ని చక్కగా ఆవిష్కరించారు. పుస్తక పఠనంతో మెదడుకు మేత! బాల్యం నుండి మొదలుకొని వృద్ధాప్యం వరకు భౌతికంగా, మానసి కంగా ఎన్నో జీవితాంతం గుర్తుండి పోయే లాభాలున్నాయని వివరించిన తీరు బాగుంది. ఇంకా ఈ వ్యాసంలో పుస్తకాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఏ విధమైన పుస్తకాలు చదవాల్సి ఉంటుందో తెలియజేశారు.

**'సాంకేతికత.. ఓ పద్మ వ్యూహం'** వ్యాసంలో నేటి జీవన విధానం సాంకేతికలో సవారు.. విలువల్లో బేజారు అని వివరిం చారు. సాంకేతిక పరిశోధనలన్నీ ఆధునికతను మెరుగు పరుచుకో వడానికి ఉపయోగ పడినప్పటికీ.. నైతికత విషయంలో ప్రశ్నార్థక మేనని ఆచార్య కదారు గారు వ్యాఖ్యానించడంలో ఔచిత్యాన్ని గ్రహి స్తాం.. ఎప్పటికైనా మని షిదే పై చేయి కావాలని కాంక్షించే ఆచార్య కదారు గారు, మనిషి



**ప్రతులకు:** ఆచార్యకదారు వీరారెడ్డి
ఇ.నెం. 8-12-20,
బృందావన్ నగర్, రోడ్‌నెం. 8,
హబ్సిగూడహైదరాబాద్-500 007
సెల్: 9392447007

సృష్టించిన సంకేతికతే, ఆ మనిషి ఆజ్ఞల పరిధి దాటి పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అందుకు అవసరమైన సానుకూల-ప్రతికూల అంశాలను ఈ వ్యాసం లో చక్కగా ప్రస్తావించారు.

తెలివైన యువత ఎందుకు, ఇంతకు ముందెన్నడూ లేని విధంగా, విదేశాలవైపు మొగ్గు చూపుతుందో విశ్లేషిస్తూ **"మేధో వలస-తరలిపోతున్న జ్ఞాన సంపద"** వ్యాసాన్ని తీర్చిదిద్దారు. మేధోవలస మనజాతికి, దేశానికి ఎనలేని నష్టం అంటే ఎవరూ కాదనలేని సత్యం.. ఇది ఈనాటి నిజమని వివరించారు. దాదాపు ఇరవై సంవత్సరాలు శ్రమపడి జ్ఞాన కణికలుగా తయారైన మన విద్యార్థులు, కారణాలేవైనా విదేశాలకు వెళ్లి ఆ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రయత్నంలో వున్నారని, చేతికందిన పిల్లలు ప్రయోజకులైన పిదప చేయి జారిపోతే.. వారి తల్లిదండ్రుల బాధ వర్ణనాతీ తమని పేర్కొన్నారు. యువ మేధావుల్లారా.. ఇకనైనా ఆగిపొండి.. మన దేశానికే మీ మేధస్సును వినియోగించండన్న అర్థం ధ్వనించేలా మంచి ముగింపునిచ్చారు.

**'కుటుంబం..ఓ కంఠహారం"** వ్యాసంలో కుటుంబం అంటే ఉల్లి పొరలాంటి ముసుగు కాదనీ.. ప్రతి పిల్లగాలికి ఊగే కొమ్మ కాదనీ.. పెనుగాలికైనా తొణకని కాండం లాంటిది కుటుంబం అని నొక్కి వక్కాణించారు. రాతి కోటలా కుటుంబం ఘనమైనదనీ.. స్థిరమైనదనీ.. బాహ్య దృష్టికి కఠినంగా అనిపించినా.. అదొక ద్రవించే మమతల మూట అనీ.. మనసులు పెనవేసుకున్న ముడుల గోళంగా అభివర్ణించారు. కుటుం బంలోని బంధాలు- అనుబంధాలను చక్కగా రచయిత ఈ వ్యాసంలో ఆవిష్కరించారు. కుటుంబం బలమైన భావోద్వేగాలకు నిలయ మనీ.. కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు అతి సామాన్యమని.. వాటిని అధిగమించి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయాలన్న ఆలోచనను పాఠకులకు కలిగిం చేలా ఆచార్య కదారుగారు ఈ వ్యాసాన్ని రూపుదిద్దారు. ప్రతి కుటుంబ సంగీతంలో శృతి సరి చేయాల్సిన కొన్ని కూనిరాగాలను వివరించారు.

**"విందు విలాసా(పా)లు'** వ్యాసంలో నేటి పొదుపు రేపటి బలమని.. ఉన్నంతలో మెదిలితే మేలని వివరించిన తీరు బాగుంది. నేటి విందులంటే విలాసాలకు వేదికలని.. ఇకనైనా విలా సాలకు కళ్లెం వేయాలన్న ఆలోచన కలిగించే విధంగా ఈ వ్యాసం ఉంది. వినోదాల పేరుతో సంప్రదాయాలను, సంస్కృతినీ తుంగలో తొక్కవద్దని, మన సంస్కృతికి మనవే కాపాలాదారులం కావాలని హితవు పలికారు. విందులు- వినోదాల పేరిట దుబారా ఖర్చులకు తెరలేపవద్దన్న సంగతిని నర్మగర్భంగా తెలియజేశారు.

**"అంకాత్మక ఉపవాస దీక్ష"** ( డిజిటల్ ఫాస్టింగ్) వ్యాసంలో..నేటి వేగవంతమైన ప్రపంచంలో సాంకేతికతకు ఎన్నో అవతారాలున్నాయనీ.. నేటి ఆధునిక కాలంలో ఏదో ఒక సాంకేతికత మనిషి జీవితంలోని ప్రతి చిన్న వ్యాపకంలోకి వ్యాపించి బలంగా తిష్టవేసిన సంగతు లను విశ్లేషించారు. ప్రత్యే కంగా అంకాత్మక (డిజి టల్) అవతారం ఎత్తాక సాంకేతికతను వినియో గించకుండా జనాలకు ఒక్క సెకను కూడా గడవడం లేదన్న విషయాలను ప్రస్తా వించారు. నేటి మనిషి మెలకువ లో ఉన్నంత కాలం విరామం లేకుండా డిజిటల్ సుడిగుం డంలో కొట్టుమిట్టాడుతున్నాడనీ.. కొలనులో వున్న చేపైనా అప్పుడప్పుడు ఉపరి తలంలో తేలుతూ సేద దీరినట్టు, డిజిటల్ వలయాన్ని తెం చుకుని మనిషి అప్పుడప్పుడు బయటకు రావాలని సూచిం చారు. ఆ దిశలో రోజుకు కొన్ని గంటలో, వారానికి ఒక రోజో.. ఓ క్రమ పద్ధతిలో డిజిటల్ ఉపకార దీక్ష చేపడితే శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తుందని ఆచార్య కడా రుగారు వివరించారు. **"దాగుడు మూతలు"** వ్యాసంలో బంధాలు అనుబంధాలను ఆవిష్కరించారు.

జీవితమంటేనే వరుస బంధాలు, దాంపత్య బంధంలో కన్నా ఏ బంధంలోనూ ఎక్కువ దాగుడు మూతలు ఉండవనీ.. ఈ బంధంలో ఉన్న త్యాగ గుణం, సాన్నిహిత్యం వేరే ఏ బంధంలోనూ ఉండదని పేర్కొన్నారు. ఒకరి గురించి ఒకరు క్షుణ్ణంగా తెలుసుకోవాలని తాపత్రయ పడే గొప్ప బంధమని వివరించారు. బంధమేదైనా నిజాయితీయే నమ్మకానికి మూలస్తంభమని తేల్చి చెప్పారు.

**"అన్నం బ్రహ్మ"** వ్యాసంలో అన్నదాత రైతన్న గురించిన కొన్ని ముఖ్యాంశాలను చర్చించారు. మట్టిని నమ్ముకుని, మట్టి మనిషిగా కొనసాగే రైతన్నల వెతలకు ఈ వ్యాసంలో రచయిత అద్దం పట్టారు.

**"చిన్న కుటుంబాలు- ఒకే రాయి శిల్పాలు"** వ్యాసంలో క్రమంగా కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాలను ప్రస్తావిస్తూ.. ఆధునిక ప్రపంచంలోని చిన్న కుటుంబాల పట్ల జనం చూపుతున్న మక్కువను వివరించారు. ఏ మనిషికైనా అభివృద్ధే అభిమతం కావాలని కాంక్షించారు. పక్షి పిల్లలైనా రెక్కలు ఎదిగే దాకా గూడు విడిచి వెళ్లే సాహసం చేయననీ.. అలాగే ఎదిగిన పిదప ఎవరి మీద ఆధారపడకుండా స్వయం కృషితో జీవించాలను కోవడం మనిషికి మంచి లక్ష్యం అని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం నుండి వేరుగా, తనకు తానుగా స్థిరపడాలనుకోవడం ఆహ్వానించదగిన మార్పు అని వివరించారు. అయితే.. సమాజం లో మనిషి విలువ పెరిగేది కన్న వాళ్లను కంటికి రెప్పలా కాపా డుకున్నప్పుడేనని తేల్చి చెప్పారు. కన్న వారు తమ అభివృద్ధికి గుదిబండలనే అభిప్రాయాన్ని విడ నాడాలని సూచించారు. వారు ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు మూల స్తంభాలన్న విషయాన్ని విస్మరించరాదని.. వారే ఇంటిల్లి పాదికీ శుభాలను మేల్కొలిపే గుడి గంటన్న సంగతిని నేటి తర ం తెలుసుకోక పోవడం విచారక రమని వ్యాఖ్యానించారు. "పేగు బంధంలా, ప్రేమ బంధం" కూ డా అంతే శాశ్వతం కావాలని కాంక్షించారు.

**"ఎవరు బాధ్యులు?"** వ్యాసం లో పిల్లలను పెంచే క్రమంలో తమ కుటుంబం యొక్క సంస్కార బలాన్ని ప్రతిబింబించేలా నడుకో వాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువు విషయం లో పిల్లలపై పరిమితిని ఒత్తిడిని పెంచకూడదని హితవు పలికారు.

**'జీవిత లక్ష్యం'** వ్యాసంలో మనిషి పుట్టుక కాకతాళీయం కాదనీ.. ఆ పుట్టుకకు ఓ నిర్దిష్టమైన లక్ష్యం ఉంటుందని పేర్కొన్నారు. మనిషి జైత్రయాత్ర మొదలయ్యేది పుట్టుకతో కాదనీ.. జీవితంలో ఎదిగే క్రమంలో, శ్రమతోనే వీరత్వం, ధీరత్వం, శూరత్వం, కొంతమేరకే పరిస్థితుల ప్రభావం.. అని వివరిస్తూ.. ఎవరి కైనా జీవితయానం సరళరేఖ కాద నీ.. మలుపులతో పాటు ఒడిదుడుకులు ఉంటాయని తెలిపారు. అందుకే నిశ్చలమైన నిర్భరతతో, స్థిరమైన గమ్యంతో ముందుకు సాగాలని ఆచార్య కదారుగారు సూచించారు. జ్ఞానం ఉంటేనే సరిపోదు విజ్ఞానిగా ఎదగాలని పేర్కొన్నారు.

**"పొగడ్త..ఓ సమ్మోహనాస్త్రం"** అబద్దాలను అందంగా కూర్చిన అక్షరాల అలంకరణ హారం పొగ డ్త అనీ.. పస లేకున్నా పసందైన స్తుతి మాల అనీ.. వర్ణనలన్నీ అబ ద్దాలైనప్పటికీ సంతోషాన్ని కలిగి స్తాయి. అయితే అవి నెత్తికెక్కనంత వరకు పొగడ్త ఆరోగ్యకరమే.. ఆనందకరమేనని రచయిత వ్యాఖ్యానించారు. పొగిడే వారికి తిట్టడమూ తెలుసుననీ.. అందుకే పొగడ్తకు లొంగక, విమర్శకు కుంగని వారిదే నిఖార్సైన వ్యక్తిత్వ మని తేల్చి చెప్పారు. పొగడ్తలు అప్పుడప్పుడు అవసరమైనప్పటికీ అవసరం ఉన్నంత మేరకే వాటిని స్వీకరించాలని సూచించారు.

**'ఇల్లు.. మనిషికి చిరునామా!"** వ్యాసంలో మనిషికి.. ఇల్లుకు ఉన్న బంధాన్ని చక్కగా ఆవిష్క రించారు. ఎక్కడ ప్రేమ ఉంటుందో, అక్కడే అసలైన ఇల్లు ఉంటుందనీ.. హృదయం ఎక్కడ ఉంటుందో అక్కడే ప్రేమ ఉంటుందని తెలియజెప్పారు. ఇల్లంటే గోడలు, తలుపులు ఉన్న భౌతిక ఆవరణ కాదని మన తలపుల్లో అనుక్షణం ఆవరించే ఓ భావన.. ఓ మానసిక సౌధం.. మనశ్శాం తికి భౌతిక రూపం ఇల్లు అని వివరించారు.

**'వంచనాత్మక కళారూపాలు'** వ్యాసం వైవిధ్యంగా మలచబ డింది. ఆధునిక కాలంలో ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఎలా ఉందో.. సహాయానికి సహాయం ఎలా వుందో ఆచార్య కదారు గారు విశ్లేషిం చిన తీరు బాగుంది. లాటిన్ భాష నుం డి పొందిన క్విడ్ ప్రోక్వో' వ్యవస్థను, వ్యక్తిని ప్రభా వితంచేలా తిరు గులేని అస్త్రాలైనాయని పేర్కొన్నారు. లాటిన్ భాష నుండే దిగుమతి చేసుకున్న "ప్రో బ్రోనో పబ్లికో" (సదా మీ సేవలో) పదం "క్విడ్ ప్రోక్వో"కు విరుద్ధం.. పారితోషికం ఆశించని ఉచిత సహాయం.. నేడు ఇది దురదృష్ట వశాత్తు అరుదుగా అమల్లో వున్న ప్రక్రియ! అని వాపోయారు.

**సామాజిక చైతన్యాన్ని కాంక్షించి.. రాసిన ఈ వ్యాసాలు ప్రతి ఒక్కరు చదువ దగినవి. ఈ పుస్తకం ప్రతి గ్రంథాలయంలో ఉండదగినది.**

ఆచార్య కదారుగారు ఈ వ్యాస సంపుటిలో భిన్నమైన వస్తు వులకు చోటు కల్పించారు. సమాజంలోని తీరు తెన్నులను- వ్యక్తుల నడవడులను ఎంపిక చేసుకున్న వస్తువుల వెలుగులో.. తమ అనుభవాన్ని రంగరించి.. సమాజాన్ని చైతన్య పరిచే దిశలో తమ భావాలను అక్షరాల్లో ఆవి ష్కృతం చేశారు. **"వదం తులు- కట్టు కథల కనికట్టు", "ఖాళీ గూడు భావన", ప్రగల్భాల పర్వ ం- మనిషి జీవిత పర్యంతం", "హక్కులు-బాధ్యతలు", "ఉచితాలు-సహేతుకమా?- అహేతుకమా"** వంటి వ్యాసాలను తీర్చి దిద్దడంలో ఆచార్య కదారుగారు ప్రదర్శించిన ప్రతిభ విశ్లేషించిన తీరు ప్రశంస నీయంగా ఉంది.

చివరి వ్యాసం... **"వృద్ధాప్య సౌదర్యం"!** ఈ వ్యాసంలో వయ సు మనసుకు కాదు.. శరీరానికి సంబంధించిందనీ.. ఈ విష యంలో ఒక్కొక్కరి దృక్పథం ఎలా వుంటుందో ఆచార్య కదారుగారు వివరించే ప్రయత్నం చేశారు. మహాకవి సినారె గారన్నట్లు.. **"ముడతలు ముఖానికే కానీ.. మనసుకు కాదు"..** వయసు పెరుగుతున్నప్పటికీ హృదయానికీ ముడతలు పడకుండా ఉంచు కోవడం ముఖ్యమని సూచించారు. వృద్ధాప్యాన్ని శాపంగా పరిగణించు కోకుండా.. దాన్ని ఓ అద్భుతమైన దశగా మలచుకోవాలని హితవు పలికారు. వృద్ధులు అనుభవాల నిధులనీ.. వృద్ధాప్యం ఓ కళారూ పమనీ.. అంతులేని అనుభవా లగని అని తెలియజేశారు. అందం విచ్చుకునే వయసు యువత దైతే.. లోపలివైపు అందంగా ముడుచు కుని దాక్కునే అలంకారం 'వృద్ధాప్య సౌందర్యం' అని ఆచార్య కదారుగారు అందంగా చెప్పారు.

ఇలా ఈ వ్యాస సంపుటిలోని ప్రతీ వ్యాసం ఓ గొప్ప సందేశాన్ని మోసుకొచ్చింది.

రచయిత ఆచార్య కదారు వీరారెడ్డి గారి అనుభవసారం పరిశీల నా పటిమ.. ఇందలి వ్యాసాల్లో అడుగడుగునా కానవస్తాయి.

సామాజిక చైతన్యాన్ని కాంక్షించి.. రాసిన ఈ వ్యాసాలు ప్రతి ఒక్కరు చదువ దగినవి.

ఈ పుస్తకం ప్రతి గ్రంథా లయంలో ఉండదగినది.

ఈ వ్యాసాలన్నీ యిది వరకే ప్రముఖ పత్రికల్లో ప్రచురింప బడినప్పటికీ.. మళ్ళీ మళ్లీ చదవాలనిపించే విధంగా ఉండటం విశేషం!



-దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1725వ రోజు 'యుద్ధం- ఫలితం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'యుద్ధం-ఫలితం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## మిగిలేది బూడిదే

బూడిద కుప్పలపై
మరణమృదంగ నాదాలు
కాలిన అవయవాల
నల్లని పొగల వాసనలలో
అనాథలైన బాంధవ్యాలు
మాటలకందని హృదయవిదారక
యుద్ధానంతర దృశ్యాలు
తెరిచిన కనులు చూసే
నరకపు ఆనవాళ్ళు..!!.
అధికారపు అహంకారం
మదపుటేనుగు అవతారమెత్తితే
స్వైరవిహారమే చేస్తుంది
అమాయకుల ఆయుస్సులను
అమాంతంగా తొక్కేస్తుంది..!!.
విచక్షణ కోల్పోయి
చెప్పుడు మాటలకు బలై
నక్కవినయాలే అక్కున
చేర్చుకుంటాయనుకుంటే
పప్పులో కాలేయక తప్పదు
ముప్పును కొనితెచ్చుకోక తప్పదు!!.
క్షణం- క్షణం శ్రమించి
అంచెలంచెలుగా ఎదిగిన అభివృద్ధిని
అరక్షణంలో పణంగా పెట్టి
పొరుగును నమ్మి
కాలుదువ్విన పాపానికి
యుద్ధమనే కారు మేఘాలు కమ్మాయి
రక్త ధారలే కురిపిస్తున్నాయి
మనసులను బరువెక్కిస్తున్నాయి!!.
యుద్ధవర్షం ఏదో క్షణం ఆగుతుంది
శాంతి కాముకత అని
చేతులు కలుపుతుంది
అంతా అయిపోయాక
తిరిగి చూస్తే ఏం మిగులుతుంది??
యద్ధఫలితంగా...బూడిద తప్ప.
సామరస్యపు శ్వాస తీసుకుంటే
శాంతి సమకూరుతుందికదా
మారణహోమం తగ్గుతుంది కదా!.

-సావిత్రి రంజోల్కర్

## రణంతో రక్తపాతమే!

రణం వినాశకారి
కోల్పోతాడు రణరంగంలో అడుగిడితే
విచక్షణ, యుక్తాయుక్త జ్ఞానం మనిషి!
స్వపర భేదం మరిచి ప్రవర్తించు!
యుద్ధంలో జయాపజయాలు దైవాధీనం!
ఎవరి వేటు ముందైతే వారే గెలుస్తారు!
యుద్ధంతో ప్రజా నాశనం!
పాడిపంటలు అన్నీ ధ్వంసం!
ఇళ్ళు ఎన్నో అకస్మాత్తుగా కూల్చివేత
కర్మాగారాలు, ఓడరేవులు ధ్వంసం!
విమానాశ్రయాలు అతలాకుతలం!
జన జీవనం దుర్భరం !
మానవ మాంస ఖండాలే ఎటు చూసినా!
చుట్టూ పారే రక్తపుటేరులు!
తిండికి కరువై, ఒంటికి గాయాలయి
ప్రాణాలు ఉంటాయో పోతాయో భయం!
కుటుంబమంతా పస్తుల మయం!
జనాభాలో ఘోరంగా తగ్గుదల
పనిచేసే వారు లేక సతమతం!
పండించే వారు లేక కాటకం!
చెట్టూ చేమల నాశనంతో అనావృష్టి!
జలధారలు కరువై పెరిగే దాహార్తి!
మానుకో యుద్ధం
చేసుకో సంధి
సుఖపడతారు దేశ ప్రజలంతా!!.

-కోలా సత్యనారాయణ

## వినాశకారి

యుద్ధం తర్వాత
గెలుపు వరించినా
ఓటమి పాలయ్యి
అమేథీ వేయబడినా
తెప్పలుగా శవాల
కుప్పలతో సహవాసం
అవయవాలు పోగొట్టుకున్న
క్షతగాత్రులతో ఆవాసం
ఎటు చూసినా ఇంటి దిక్కును
యుద్ధానికి బలిచ్చిన విధవలు
ఆలనా పాలనా చూసే వారు లేని పిల్లలు
బంకర్లలో తల దాచుకుని
భయంతో ఉక్కిరిబిక్కిరి
పంట పొలాలు రైతు సేవల కోసం
ఎదురు తెన్నులు.
బాంబు పేలుడుకు
తెగిపడ్డ అవయవాలు
భూమాత మేనంతా లోతైన గాయాలు
మంటల్లో చిక్కుకుని ప్రాణాలు
కోల్పోయిన అభాగ్యులు
ఇవేఇవే చుట్టూ కనిపించే
వినిపించే యుద్ధం సైరన్లు
రణమెపుడూ కారణమేగా
మారణ హోమాలకి.
అందుకే వద్దందాం రణం
కావాలందాం స్నేహ వాతావరణం
చెప్పుడు మాటలకు రాం రాం
యుద్ధం వద్దు!
స్నేహమే ముద్దు అందామందరం.

-ప్రశాంతి రేవూరి

## ఆత్మాహుతి

జుయ్ జుయ్ జుయ్
దూసుకు పోతున్న మిసైల్స్ లోంచి
నిప్పులు చిమ్ముతున్న బాంబుల దాడి
పటపటపట పేలిన బాంబుల శబ్దం
పేలిన బాంబుల దాడిలో కూలిన భవనాలు
మిన్నంటిన భవన శిధిలాల
దుమ్ము ధూళి
ఎర్రని మంటల నుండి నల్లని పొగలు
సుడులు తిరుగుతూ
నింగిని కమ్ముతూ మింగేస్తున్నట్టు..
ప్రజల ఆర్తనాదం
తెగిన అవయవాలు
కాలి ముద్దైన దేహాలు
ఎగిరిపడుతున్న మాంసం ముద్దలు
చీలిక పేలికలైన శరీరాలు
ఎవరి పాపానికీ ఎవరు బలి?
ఎవరి పంతాలకు ఎవరు నాశనం?
ఆస్పత్రుల్లో రోగులు, సిబ్బంది
తరగతిగదులలో శ్రద్ధగా
చదువుకుంటున్న చిన్నారులు, గురువులు
వీరేం పాపం చేసారు?
వీరా శత్రువులు?
దేశాధినేతలు రక్త పిపాసులై
యుద్ధం చేయడం
ఆధిపత్య పోరు..
అందరూ అణుబాంబుల తయారీలో
మాహీర్ లే
ఒకరి నుంచి మరొకరికీ అభద్రత
ఆనాటి మహాభారత యుద్ధంలో
పాండవులు యుద్ధం కోరలేదు..
బలవంతంగా జరిగింది
ఆనాటి రామరావణ యుద్ధంలో
రాముడు యుద్ధం కోరలేదు..
బలవంతంగా జరిగింది
గత కొన్ని సందర్భాల్లో
భారత్ యుద్ధం కోరలేదు
యుద్ధం భారత్ మీద
బలవంతంగా నెట్ట బడింది..
ఒక ప్రాంతం గురించి
మరొకరికి చిన్నచూపు
కొందరికి అభద్రత
ఎదుటివారిపై అపనమ్మకం
ఎవరికి వారు తమకు
అణ్వాయుధాల రక్షణ వలయం
స్వీయ రక్షణ కోసం అంటూ
నిరాయుధీకరణ వైపు
ఆలోచించలేని పరిస్థితి..
మానవ జాతి మొత్తం
తోటివారిని నమ్మలేకపోవడం
తుపాకీ మోతలు పోయి
అణుబాంబుల దాడులతో
మానవజాతి మొత్తం
ఆత్మాహుతి చేసుకుంటోంది..
హిరోషిమా నాగసాకి
యుద్ధానంతరం కూడా
కాలుష్యం తో భావి తరాలు
సంతానోత్పత్తి లేకపోవడం
పుట్టినా
మానసిక శారీరక వైకల్యంతో
శిశు జననాలు
వాతావరణం
నింగీ నేలా కాలుష్యంతో
పంటలు పండక
కరువు కాటకాలు
కాలుష్య ప్రాణ వాయువు పీల్చి
అనారోగ్యం పాలైన ప్రజలు
కొన్ని తరాలకు
దుర్భర జీవనపరిస్థితి.

-పి.బాలాత్రిపుర సుందరి

## మనిషికి సహజ గుణం

యుద్ధం ఆరంభం
మనిషి పుట్టుకతో.
దీని వేళ్ళు మనిషి కళ్ళలో
ఎదుటివాడి ఎదుగుదల
ఎద భరించదు గదా
అదే అన్ని యుద్ధాలకు కారణం
దీనిపేరే అసూయ.
''నేనే'' అన్న అహంకారం
హుంకరిస్తుంటే
పిచ్చివాడి చేతిలో రాయిలాగా
మారణాయుధాల దాడి
ప్రపంచ ప్రజలకు వేదన
దాన్ని వర్ణించేందుకు
ఎవరికీ లేదు కవిత్వ బలం..
అందుకే యుద్ధం వద్దు
పెద్దలారా! పెద్ద మనసుతో
మానండి మారణ హోమం
చాలు యుద్ధ భీభత్సం.
దేశాలంటే
ద్వేషించుకోవడం కాదని
ప్రపంచ ప్రజల మంచి కోసం
శ్రమించడమని తెలుసుకోండి
చేయాలి శాంతి యజ్ఞం.
కోరాలి ప్రశాంతి నిరంతరం.


-డా.సి.వసుంధర



# అమ్మ కనకమ్మ

పుస్తక సమీక్ష



ప్రతులకు: పుట్టపర్తి నాగపద్మిని
-సాహితీ ప్రచురణలు
ఫోన్:0866-2436642/43

ఎక్కడ దాచుకోదగ్గ కొత్త అక్షరం అగుపడ్డా ఇట్టే పట్టేసి, ఎలా భద్ర పరచాలో తెలిసిన అక్షర భాండాగారి కుడు మోదుగుల రవికృష్ణ.

మా రాయలసీమకే కాదు. యావదాంధ్రజాతికి గర్వకారణమైన సాహిత్యరత్నం 'సరస్వతీపుత్ర' శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులుగారు. ఆ రత్నాన్ని పొదివి పట్టుకొని, ఆ కాంతిని మరింత ఇనుమడింపచేసిన సార్థకనా మధేయ, పదారు వన్నెల కనకహారం శ్రీమతి పుట్టపర్తి కనకమ్మ గారు. వారిలో అక్షరాలా సగభాగం, వారి అక్షరాల భారం పూర్తిగా మోసి రాసిన వారి అర్ధాంగి లక్ష్మి సరస్వతీపుత్రి శ్రీమతి కనకమ్మగారు.

ఆధునికాంధ్ర సాహిత్య అవతరణ కాలంలో, చావలి బంగారమ్మ తర్వాతి తరంలో, యావదాంధ్ర దేశంలోనూ పేరెన్నికగన్న కవయిత్రుల్లో అమ్మగారూ ఒకరు. తెలుగు పుణ్యామతల్లులు తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, బసవరాజు రాజ్య లక్ష్మమ్మ ప్రభృతులతో పాటు తెలుగు సాహిత్య రంగాన సుస్థిర స్థానాన్ని పొందిన కవయిత్రి. తేటగీతిని గేయంగా నడిపిస్తూ, గీతాన్ని తేటగీతి గా మలుస్తూ, చందోబద్ధమైన 'లలిత (లిరికల్) కవిత్వం'లో తమకంటూ ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకొన్నవారు. జాతిప్రబోధకమైన సంస్కృతంలో చిరస్మరణీయకవిత్వం రాసినవారు. ఆకాశ వాణి ప్రసారాల్లో, సుప్రసిద్ధ సంగీత దర్శకుల స్వరకల్పనల్లో, పదే పదే ప్రసారం పొంది, బహుళ ప్రచా రం పొందిన పదకవితల్ని, కీర్తనల్ని రచించినవారు. అభినవ వాగ్గేయ కారిణి. అయినా పుట్టపర్తిగారి చాటునే కీర్తికి దూరంగా ఒదిగి నిలిచిన సంప్రదాయ ఆదర్శగృహిణి. నిత్యపతి సేవా పరాయణి. సదా వాల్మీకిరామా యణ పారాయణి. సంస్కృతాంధ్ర సాహిత్యా ల్లో సమప్రజ్ఞ సాధించిన విదుషీమణి. భావసాంద్రత, రసార్ధ్రత మూర్తీభవిం చిన అక్షరనారాయణి.

కస్తూరిబా గాంధీగారి నిర్యాణ వేళ, ప్రతి అక్షరంలో తమ కన్నీటిని దాచి, వారు రాసిన సంస్మరణ గీతి-

**శాంతమైనట్టి గంభీర సరసియందు**
**బడెడు ఘూర్ణిల్లజేసిన పిడుగువోలె**
**మామకీన చిత్తమ్ము నీ మరణవార్త**
**కలచినది తల్లి, హైందవ కల్పవల్లి!**

అంటూ మొదలైన 'కస్తూరీబా' అశ్రుగీతి యావదాంధ్రుల అశ్రు తర్పణంగా నాడు గౌరవాన్ని అందుకొంది.

వారి గారాలపటిమట సోదరి డా॥ నాగపద్మిని గారు, మా 'సాహితీ సిరికోన' వాక్ష్మలి (వాట్సప్‌కు నా తర్జుమా)లో ప్రతిరోజూ పుట్టపర్తివారి సర్వతోముఖ సాహిత్యవైభవాన్ని పరిచయం చేస్తూ, ఒకరోజు ఆ తల్లి గూర్చి రాశారు. అయమ్మ సాహిత్య మూర్తిమ త్వాన్ని నాడు కళ్ళకు కట్టించిన తీరు నిరుప మానం. గంపెడు సంసారంలో ఇంటిపనుల న్నింటిని ఒంటిచేత చక్కదిద్దుతూనే, అయ్యగారి సాహిత్యకృషికి దీపం వెలిగించి పెట్టి, అందులో నిత్యం తానే వత్తిలా వెలుగొందిన వైనం, ఎప్పుడో దొరక్క దొరక్క దొరికిన తీరికను అక్షరాలుగా మార్చి, పెట్టె అడుగులో దాచుకొన్న తీరు డా॥ నాగపద్మినిగారు పరమార్థంగా చిత్రించారు.

దాన్ని అందరం చదివాం. నిశ్శ బ్దంగా కరిగిపోయాం. కానీ, అక్షర షరాబు రవికృష్ణ ఎప్పుడు నాగపద్మిని గారిని సంప్రదించాడో, ఎప్పుడు మెప్పించాడో, ఒప్పించాడో తెలియదు. కానీ, ఎప్పుడో మార్చి నెలలోపే పుస్తక రూపేణా రావలిసిన ఆ ధారావాహిక పనిని పక్కన పెట్టించి, ఇదిగో అమ్మ వారి మీద ఇంత చక్కటి పుస్తకాన్ని తెలుగమ్మ చరణాలకు అందిస్తున్నాడు. రాసిన రచయిత్రి ఎంత ధన్యనో, రాయించిన రవికృష్ణ కూడా అంతే ధన్యుడు. ఇక బిడ్డచే తన కథ చెప్పించుకొన్న ఆ తల్లి ధన్యాతిధన్య.

అదేమిటో, ఆడబిడ్డకు అమ్మ ఎంత ప్రియమైనా, అయ్య మీద ప్రేమ ఒకింత ఎక్కువగానే ఉండటం జగ త్కృత్యం. అందునా ఇక్కడ అయ్య ఎవ రు? సాక్షాత్తు సరస్వతీదేవి ముద్దుల పట్టి. యావద్భారత కీర్తిగన్న పుట్టపర్తి. అలాటప్పుడు ఇంటి చిన్నబిడ్డకు అమి త వీరారాధన ఏర్పడటంలో ఆశ్చర్యమే ముంది? అమ్మకథ అయినా, అయ్య మీద ఆరాధనే ఇందులో ఒక్క పిసరు ఎక్కువ కథనమయిందంటే ఆశ్చర్యం లేదు. లేకుంటే కనకమ్మగారి సాహిత్య వివేచనకు మరికొద్ది ఎక్కువచోటు దక్కి ఉండేది. అయినా ఉన్నదేమీ తక్కువ కాదు. ఆ తల్లి మధురరచనా మహ త్తును సమగ్రంగానే పరిచయం చేస్తోం ది. అయినా ఆయమ్మ రాసినదెంత? రాయడానికి వారికి దొరికిన సమయ మెంత? ఆయన ఆశువుని అక్షరీకరిం చడంలోనే తన్ను తాను అక్షరంగా మార్చుకున్న పుణ్యకాలాల సోమిదమ్మ.

సోదరి నాగపద్మిని దీనినొక జీవి త చరిత్రగా కాక, సృజనాత్మక నవల శైలిలో మొదలుపెట్టి నడిపించారు. అందువల్ల పాఠకుడు వెంటనే కథనం లో లీనమైపోతాడు. కళ్ళముందు ఆ దొడ్డ ఇల్లాలి కష్టాలను చూస్తూ కన్నీళ్ల పాలవుతాడు. ఒకనాటి భారతీయ గృహిణి చిత్రాన్ని కళ్లారా దర్శించి కైమోడ్పు లందిస్తాడు. ఒక విధంగా ఇది గతించిన ఒక మహత్తర సాంస్కృ తిక ఘట్టానికి సమీప సజీవచిత్రణ. అందుకు ప్రత్యేకంగా రచయిత్రికి నా అభినందనలు.

మరుగున దాగిన ఒక మాణిక్యకాంతి ప్రచురానికి కృషిచేసిన విశ్వనాథ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మద్దినేని సింహకౌటిల్య చౌదరికి వివిఐటి కళాశాలకు ప్రత్యేక అభినందనలు.

-గంగిశెట్టి నారాయణ

## దేశాల మధ్య యుద్ధం-వలస జీవులు

మధ్య ప్రాచ్య దేశాలపై
కురుస్తున్న బాంబుల జల్లులు
శవాల కుప్పలపై సామ్రాజ్యపు కలలు
వలస కూలీల కళ్ళల్లో చెదరని కన్నీటి అలలు
గెలుపు కేకల వెనుక ఎన్నో మౌనరోధనలు
నిత్య దాడులతో కూలిపోతున్న పెద్ద పెద్ద భవనాలు
పొగమంచుల్లోనే బిక్కుబిక్కుమంటూ
నివసిస్తున్న వలస జీవులు....
పసిపిల్లల ఆకలి కేకలు... తల్లుల కన్నీటి ధారలు...
శరణార్థుల కోసం ఎదురుచూపులు...
ఆకలి తీర్చలేని ఆయుధాల మధ్య,
శాంతి కోసం పడిగాపులు!.
శాంతి కపోతం రెక్కలు విరిగి
అనాధల ఆకాశం వైపు చూస్తుంది!
గగనాన అణుబాంబుల మ్రోతలు వినిపిస్తుంటే,
వలసజీవుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి
గెలుపు ఎవరిదో తెలియని ఈ చదరంగంలో
బలైపోయేది నిత్యం సామాన్య ప్రజలే!.
ఎక్కడో, ఎవరికో అధికారం కొరకు దాహం
మరి ఎక్కడో
సామాన్యుల ప్రాణాలతో మారణహోమం...
సరిహద్దుల్లో తుపాకీ గొట్టాల గర్జన
వలస జీవితాల గుండెల్లో
ఎగిసిపడుతున్న మౌనరోదన!.
వలస పోయిన బ్రతుకులకు ఊపిరి భారమై
సొంత ఊరికి చేరే దారి చీకటై
రెక్కడకపోయినా డొక్కాడని బ్రతుకులై
ముందుకు సాగుతున్న వలస పాదాలు!.
అధికారం కోసం దేశాల మధ్య యుద్ధం
సందుగొందుల్లో సామాన్యుల జీవనం
ఒకరు గెలుపు కోసం పోరాటం
మరొకరు గంజి మెతుకు కోసం ఆరాటం
ఏ దిక్కుకు వెళ్ళాలో తెలియని పయనం
వలసకూలీల జీవితం.. ముగింపు లేని విషాదం!.
పొట్టకూటి కోసం
బ్రతుకు బండిని మోయలేని దీనస్థితిలో ఊరిని,
అయినోళ్ళని వదిలి
ఎడారి దేశానికి పయనమైన కార్మికులు!
వలస వెళ్లడం అంటే కేవలం ఊరును వీడడం కాదు
అమ్మ ఒడిని కోల్పోవడం....
నాన్న అడుగుజాడలను మరవడం...
ముక్కలైన కలలను ముళ్ళబాటపై మోయడం!
నేడు యుద్ధమేఘాలు బాంబులతో గర్జిస్తుంటే
మిస్సైల్ దాడుల మధ్యన జీవించాలంటే
ఏమవుతుందో తెలియని భయం....
అమాయకపు కంటికి కునుకు రాక
నోటికి ముద్ద దిగక....
కన్నవారిని,ఆలు బిడ్డలను తలుచుకుంటూ
ప్రాణాలను అరచేత పట్టుకొని జీవిస్తున్న గల్ఫ్ కార్మికులు!.
జీవితాలు శిథిలం అవుతాయేమో కానీ
చరిత్ర ఎప్పుడు చలనశీలమే...
అది రక్తాన్ని కన్నీళ్ళని మోసుకుంటూ
దశాబ్దం నుండి శతాబ్దం వరకు ప్రవహిస్తూనే ఉంటుంది!
ఆకలికి ఆయుధాలు తెలియవు
కన్నీళ్ళకు దేశాలు తెలియవు
కష్టజీవులకు యుద్ధాలు తెలియవు
యుద్ధం మిగిల్చేది మట్టి కుప్పలే కానీ,,
ఓడిపోయేది మాత్రం సామాన్యుడి జీవనగమ్యమే!
అందుచే.....
యుద్ధాలు ఆగిపోవాలి
మానవత్వం గెలిచి నిలబడాలి!!



-నందిని గోపు.
6302398650

## మాటల ముచ్చట్లు

మాటలు ఊహలను కదిలిస్తే
ఉషోదయాలే రూపమెత్తుతాయి
మాటలు మనసును తట్టితే
మౌనాన్నే మేలుకొలుపుతాయి.
మాటలు హృదయాన్ని కట్టేస్తే
హరివిల్లులై మెరుస్తాయి
మాటలు గుండెలను తాకితే
పద్మాలై వికసిస్తాయి.
మాటలు జీవితాన్ని పలికిస్తే
జ్యోతిరేఖలై జాగృతపరుస్తాయి
మాటలు పదాలై ప్రకాశిస్తే
మదిపొంగులే కవితలవుతాయి.
మధురమాటలుఎప్పుడైనా-ఎక్కడైనా
అంతరంగాలను అంటుకుంటాయి
మంచిమాటలు ఎవరివైనా-
ఎందుకైనా
ప్రేరణలై కదిలిస్తాయి.



-గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630



-డా॥రావి రంగారావు
9247581825

డా॥ రావి రంగారావు 2024 జనవరి నుండి ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం కథల వర్క్ షాప్‌లో ఎంపికైన రెండు కథల్ని ఇక్కడ అందించటం జరుగుతోంది.

-సంపాదకులు

## పట్టని తనం



దమయంతికి నలుడి రాయబారం మోసుకుపోయే రాజహంసలా రివ్వున దూసుకుపోతున్న రోడ్డు రవాణా సంస్థ ఎక్స్ ప్రెస్ బస్సు డ్రైవర్ వేసిన సడన్ బ్రేక్ కి కీచుమంటూ ఆగిపోయింది. ప్రయాణీకులు అందరూ ఒక్కసారిగా త్రుళ్ళి పడి కిటికీల్లోనుండి బయటకు చూసేరు ఏమైందా అని.

అక్కడ ఒక ఏక్సిడెంట్ అయింది. ఓ యువకుడు రక్తసిక్తమై పడి ఉన్నాడు.

బస్సులో ఉన్న ప్రయాణీకులు "జరిగిపోయిన ప్రమాద మేదో జరిగిపోయింది. మనం పోదాం పదండి" అన్నారు.

"మేం రోజూ ఇలాంటి వెన్నో చూస్తుంటాం. అంచేత నేను బస్సు ఆపేదిలేదు" అన్నాడు డ్రైవరు.

ఇంతలో ధర్మారావు అనే ఒకాయన ముందుకొచ్చి "చూస్తూ చూస్తూ అతడిని వదిలి మనం ఎలా వెళ్ళిపోతామండీ" అన్నాడు.

"అయితే ఆ ఆపద్బాంధవుడు మీరే ఎందుకు కాకూడదు?" అడిగేడు డ్రైవరు.

"తప్పకుండా. అందుకే నేను దిగుతున్నది" అని

అతను దిగగానే బస్ వెళ్ళిపోయింది.

ఆ దారిన వచ్చేపోయే వాళ్ళు ఒకరొకరూ ఆగి చూసి వెళ్ళిపోతున్నారు. కాని ఏ ఒక్కరూ ఆ యువకుడికి సహాయంగా చేయందించడానికి జంకుతున్నారు.

ధర్మారావు "ముందితనిని గవర్నమెంట్ హాస్పిటల్ కు అర్జెంటుగా తీసుకెళ్ళాలి" అన్నాడు. ఇంతలో అక్కడ మూగిన జనంలో ఒకరు "అలాగని చేసేరు కొంపదీసి. మధ్య మీరు ఇరుక్కుంటారు కేసులో. పోలీసులొచ్చి చూడందే మీరు ఇతనిని కదపగూడదు" అన్నాడు.

" అల్లుడొచ్చేవరకూ అమావాస్య ఆగుతుందాండీ? పోలీసులొచ్చేవరకూ ఇతని ప్రాణం ఆగుతుందా మీ పిచ్చిగానీ. కేసు కన్నా ప్రాణం ముఖ్యం. ఇతను ముందు బ్రతికి బయటపడితే అప్పుడు కేసునుండి బయట పడొచ్చు" అని ధర్మారావు 100 కూ, 108 కూ ఫోన్ చేసేడు.

"పోలీసులు రాకుండా మనం ఏం చేసినా నేరం అవుతుంది " అన్నారు అక్కడున్న వాళ్ళు అంతా ముక్తకంఠంతో.

"మళ్ళీ మొదటికొచ్చేరు. అంతవరకూ ఆగితే మన కళ్ళముందే ఓ మనిషి ప్రాణం పోతుండగా చూస్తూ ఊరుకున్నవాళ్ళ మవుతాము" అంటూ ధర్మారావు తన వాటర్ బాటిల్ లోని నీళ్ళను ఆ యువకుడి ముఖం మీద జల్లేడు. స్పృహ తప్పిన అతనిలో చలనం కలిగింది. కళ్ళు విప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. దాహం వేస్తున్నట్లుంది. పెదవులూ, నాలుకా కదుపుతున్నాడు. ధర్మారావు కప్పుతో కొద్దిగా నీళ్ళు అతని నోట్లో వేసేడు. కాని అవి ఎక్కువ బయటికే పోయేయి. అతను గుటక వేసే స్థితిలో లేదు. ఆ పరిస్థితిలో అతనిని హాస్పిటల్ కు చేర్చడానికి ఆటో గాని లేదా నాలుగు చక్రాల వాహనమేదైనా ఉండాలి గాని ద్విచక్ర వాహన మేదీ పనికిరాదు. అంచేత రోడ్డుమీద వచ్చేపోయే కార్లనూ, జీప్ లనూ, వేన్ లనూ, బస్ లనూ చివరికి లారీలనూ అన్నిటినీ ఆపడానికి అన్ని విధాలా ప్రయత్నించేడు ధర్మారావు. కాని ప్రతి వాహనం ఆగుతుందన్నట్లుగా ఆశ చూపి స్లో చేసి అక్కడి దృశ్యం చూసి మళ్ళీ వేగం పుంజుకుని వెళ్ళిపోయేది చెప్పేది వినబడేలోపునే.

×× ×

అతడి గాయాలనుండి రక్తం కారి కారి గడ్డకట్టుకు పోయింది.

గవర్నమెంట్ హాస్పిటల్ లో ఎమర్జెన్సీ వార్డుకు అతనిని తీసుకువెళ్లగలిగేరు తప్పితే అంతకుమించి ఏమీ చేయలేకపోయేరు.

"సారీ అండీ. ఇప్పుడు మేం చేయగలిగినదేమీ లేదు. చెయ్యి దాటిపోయింది పరిస్థితి. ఒక్క అరగంట ముందు తీసుకుని వచ్చి ఉంటే ఏమైనా చేసి ఎలాగో ఒకలాగ బ్రతికించగలిగేవాళ్ళం. ప్చ్! లాభం లేదు" అని పెదవి విరిచేసేరు డాక్టరుగారు.

ధర్మారావు నిర్జీవమైన ఆ యువకుడి శరీరంవైపు బేలగా చూస్తున్నాడు.

-పత్తి మురళీధర శర్మ

## ఐకమత్యం

వరండాలో కూర్చుని కూతురికి జడలు వేస్తున్న సుధ గేటు శబ్దమైతే వీధివాకిలి వైపు చూసింది. పనిమనిషి మంగ గేటు తీసుకుని వస్తోంది.

"ఏమే మంగా... ఇప్పుడా వచ్చేది? ఇంటికి చుట్టాలు వస్తున్నారు. నాగా పెట్టకుండా రమ్మని చెప్పాకదా. చెప్పాపెట్టకుండా పని ఎగ్గొటావ్... కనీసం ఫోనైనా చేశావా రావటం లేదని. అదీ లేదు. తగుదునమ్మా అంటూ తీరిగ్గా ఇప్పుడొచ్చావ్. అవసరానికి పనిచేయనపుడు పనిమనిషి ఉండి ఉపయోగమేమున్నది మాకు" అంది సుధ.

"అమ్మ... నే చెప్పేది ఒక్కసారి వినండమ్మ. అసలేమయిందంటే నాలుగు రోజుల క్రితం మా ఆయన స్పృహ లేకుండా రోడ్డు మీద పడున్నాడని ఎవరో ఫోన్ చేస్తే ఉరుక్కుంటూ వెళ్లి ఆసుపత్రిలో చేర్పించాం.

కల్తీ మద్యపానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, వైద్యానికి లక్ష ఖర్చు అవుతుం దన్నారమ్మా.

ఎలాగో చీటి పాడి, పిల్ల పెళ్ళికోసం వెనకేసిన నాలుగు రాళ్ళూ తీసి కట్టి బ్రతికించున్నా నమ్మా" అంది మంగ దీనంగా.

పిల్లలు పుట్టినాక మందు మానేసి ఆటో నడుపుతూ నన్ను, పిల్లల్ని బానే చూసుకునేవా డమ్మా...

మొన్న ఎలచ్చన్లప్పుడు డబ్బు ఆశ చూపి ప్రచారానికి తీసుకుపోయి మాయదారోళ్ళు మందు పోయించారు. ఎందుకయ్యా మళ్లీ అలవాటు చేసుకుంటావు అన్నాను. ఎలచ్చన్లు అయ్యాక ఎలాను మధ్య నిషేధం అమలు చేస్తా మంటున్నారుగా మంగీ... ఈ నాలుగు రోజులేగా అన్నాడు.

ఎలచ్చన్లయ్యాకేమో మధ్య నిషేధం అమలు చెయ్యకపోగా కల్తీ మద్యంతో ప్రాణాలు తీస్తున్నారు" అంది మంగ.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మధ్య నిషేధం అమలు చేయాలని మీరు అడగొచ్చుగా" అంది సుధ.

"ఎలచ్చన్ల సమయాన పిట్టల దొరల్లా సొరకాయలు తెగ్గోస్తారు. ఎలచ్చన్లు అయ్యాకేమో మొహం చాటేస్తారు. మా గోడు ఎవరు పట్టించుకుంటారమ్మా" అన్నది.

"అలా అని ఊరుకుంటే ఎలా? ప్రజల మౌనం ప్రమాదకరం. సమాజానికి చేటు. అమూల్యమైన ఓటుతో అందలం ఎక్కించటమే కాదు, అన్యాయాలు అక్రమాలను ప్రశ్నించే హక్కు కూడా ఓటర్లకి ఉంది. మీరంతా ఐకమత్యం కలిగి ఏకతాటిపై నడిస్తే సాధించలేనిది లేదు. మీకు తోడుగా నేనుంటా. కాలనీ వారందరినీ తీసుకురా ధర్నాకి" అంది సుధ.

గుండెల నిండా ఊపిరి తీసుకుని ఆత్మ విశ్వాసంతో ముందుకు కదిలింది మంగ.

-సంబరాజు రమణి

## హైకూలు

నిప్పుకి గర్వం
నీటిని చూస్తే మాత్రం
చచ్చేంత భయం!

కవ్వం సవ్వడి
మాయమయిపోయింది
పాలు అమ్మకంతో.

వనాలవైపు
మబ్బుల పరుగులు
జలకాలాటకు.

మండే గుండెలు
తుది సమరం దాకా
చెండాడుతాయి.

గాన కచేరి
మామిడి కొమ్మమీద
కోకిల రాగం.

పల్లె పిల్లలు
కలువ పువ్వులుగా
ఊరి చెర్వులో.

కుంభ వృష్టితో
బలే శుభ్రపడింది
మురికివాడ.

అలలు వచ్చి
పరుపు పరిచింది
సాగర తీరం.

పాల వ్యాపారి
వాటర్ బాటిల్ కొన్నాడు
వ్యాపార వృద్ధి.

నదిలో పడి
గిలగిలలాడ్తున్నాడు
చందమామయ్య.

మంచితనాన్ని
'డ్రా' చేసుకుంటారు
ఏ.టి.యం.వలె.

దాగుడు మూతా
మబ్బుల్లో చందమామ
తొంగి చూస్తుండు.


అనురాగాలు
మాయని మమతలు
వీడని బంధం.

కలల మది
కలం నుండి జారితే
కవి తలేగా!

ఉషా కిరణం
సాగర అలలపై
స్వారీ చేస్తోంది.

నవ్వు కాహ్వానం
ఆరోగ్యం మీ సొత్తేగా
మనసారా నవ్వు!

జిగేలుమంటూ
సీతాకోక చిలుక
ఎగిరే పువ్వు.



-బొబ్బిలి జోసేఫ్
సెల్:9989261991

## పాలు తెల్లని పూతన !

అవనిపై పుట్టిన ఆకలి జీవికి
అమ్మ ముద్రపాలు అమృతం బ్రతుకుకి
నవజాత శిశువులకు క్షీరం
అమ్మతనపు అమూల్య వరం!.
గంగి గోవు పాలు
గరిటెడైనా చాలన్నాడు వేమన
పాలలో వున్నది అందమైన పూతన
భాగవతం చెప్పెను పోతన
కాలజ్ఞానం చెప్పెను బ్రహ్మన్న!.
కల్తీని అరికట్టే హంసలు కరువు
తెల్లనివన్నీ పాలు కావు కావు
కల్తీ లేని పాలు లేవు లేవు
గడ్డి మేసి పాలిచ్చేవి అరుదు అరుదు
మందులతో పాలు దారలు దారలు!.
పూతన వారసులు పుట్టిరా
కల్తీచేయ కంస మామలు పంపిరా
అమృతమంటి పాలను విషం చేసితిరా
పాలకూట విషంలేని పాలు దొరకకవురా
ఏమి చేతురా శంకరా !.
అమ్మ పాలు తాగి పెరిగినోడా
జాలి లేక కల్తీచేయ చేతులెట్లు వచ్చే
నీళ్లన్నా కదిపితే బాగుండేది
పూతనవైనా కాకపోతివి
బాల కృష్ణుడు వచ్చి మోక్షంబిచ్చేవాడు!.
మనిషి తోలు కప్పుకున్న కల్తీ
మాయ ప్రవరాఖ్యులుగా మారి
మని కోసం ఎంతెంత కక్కుర్తి
ప్రాణాలు పోవ మానవతకు అపకీర్తి
చావవెందుకురా మరొక సారి!



-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## తాళ్లపాక పదసాహితికి గరికపాటి సేవలు అద్వితీయం



పుస్తకావిష్కరణలో మృణాళిని, మామిడి హరికృష్ణ, ఎస్‌బీఐ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, ఎల్లూరి శివారెడ్డి, సంగీత దర్శకులు శ్రీరామాచారి, తదితరులు

హైదరాబాద్, మార్చి 17 (నేటినిజం ప్రతినిధి):పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 523వ ఆరాధనోత్సవాలు ఆదివారం రాత్రి బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపాక పద సాహిత్యంలోని దశావతార సంకీర్తనలపై విశారద వెంకట్ గరికపాటి 'దశవిధ ధర్మరక్ష" వ్యాఖ్యాన కృతిని ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామమోహన్‌రావు ఆవిష్కరించారు. అలాగే వెంకట్ గరికపాటి రూపొందించిన "అన్నమయ్య సంకీర్తన రత్నాకరము" (7వ ముద్రణ) "నందక సంకీర్తన నందనం (రెండవ ముద్రణ) వ్యాఖ్యాన గ్రంథాలను కూడా ఆవిష్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల్లోని భక్తి, సంగీత, సాహిత్య విలువలను జన బాహుళ్యంలోనికి తీసుకెళ్లడానికి వెంకట్ గరికపాటి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వెంకట్ ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తూనే తాను రాసిన 25 పుస్తకాల్లో 23 పుస్తకాలు అన్నమయ్యకు సంబంధించినవి ఉండడం గొప్ప విషయమని తెలిపారు.

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల మధురిమలతో వెంకట్ గరికపాటి పెనవేసుకుపోయారన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య సంకీర్తనలను మధురంగా ఆలపించారు. ప్రముఖ సాహితీవేత్త పి. మృణాళిని, సంగీత దర్శకులు శ్రీరామాచారి, శ్రీరామ సంస్థ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## జీవితం విలువ

సంపదల పొదిలో దాగి ఉన్న సంఖ్యలకన్నా
మనసు పొదిగే సానుభూతే అసలైన సంపద.
బ్యాంకు ఖాతాల్లో నిలిచే అంకెలు
కాలంతో కలిసి కరిగిపోతాయి,
కాని మన మాటల్లో నిండే మాధుర్యం
ఎవరైనా గుండెల్లో నిత్యంగా నిలిచిపోతుంది.
నెట్ వర్త్
గణాంకాల కాగితంపై మెరిసే గీత మాత్రమే;
లైఫ్ వర్త్
మన జీవన శైలిలో మెరవాల్సిన దీపశిఖ.
మన చేతుల పనిని
కాలం మసకబార్చవచ్చు,
మన పదవులను
చరిత్ర పుటలు మరిచిపోవచ్చు;
కానీ మన ప్రవర్తనలోని సౌమ్యతను
ఒకసారి అనుభవించిన హృదయం
ఎప్పటికీ విడిచిపెట్టదు.
మన మాట ఒకరికి ధైర్యం అయితే
అది మన జీవితం విలువ.
మన చూపు ఒకరికి గౌరవం అయితే
అది మన జీవితానికి గౌరవం.
సంపాదించేది ధనం కాదు,
సంపాదించాల్సింది మనుషుల మనసులు.
అధికారంతో కాదు,
ఆత్మీయతతో గెలవాలి ప్రపంచాన్ని.
సౌమ్యమైన మాట
గాయాన్ని మాన్పగలదు.
గౌరవంతో చేసిన వ్యవహారం
సంబంధాలను నిలబెట్టగలదు.
ప్రతి రోజు
మనసును మెరుగుపరుచుకునే
సాధనగా మార్చితే,
ప్రతి మనిషినిగౌరవంగా పలకరించే
అలవాటుగా చేసుకుంటే,
మన జీవితం
అంకెల కంటే గొప్ప అర్థం పొందుతుంది.
సంపదల కాంతి క్షణికం,
స్వభావపు కాంతి శాశ్వతం.
మనకు మిగిలేది పేరుకన్నా పెద్దది...
మన ప్రవర్తనతో నింపిన
మనిషితనం.



-డా॥.కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఘనంగా రైటర్స్ మీట్ రజతోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు బి.యస్.రాములు, ఖదీర్‌బాబు, వాసిరెడ్డి నవీన్, కె. శ్రీనివాస్, మధురాంతకం నరేంద్ర, అయోధ్యరెడ్డి, కొప్పిలి పద్మ, శిరంశెట్టి కాంతారావు, ఘంటా చక్రపాణి, పద్మావతి బోడపాటి, యశోదా ఠాగూర్, సతీష్‌చందర్ తదితరులు.

హైదరాబాద్, మార్చి 17:ప్రముఖ జర్నలిస్టు, కథా రచయిత అయిన మహమ్మద్ ఖదీర్ బాబు గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయిలో సుప్రసిద్ధ సీనియర్ కథకుల తోపాటు యువ కథకులను, సాహిత్యంతో సంబంధం వున్న పత్రికా సంపాదకులను కలుపుకుని వివిధ ప్రాంతాల్లో రైటర్స్ మీట్ పేరుతో ముప్పై ఐదు నలభై మందితో కలిసి రెండు రోజుల పాటు కథే శ్వాసగా కథే లోకంగా వయసు, ప్రాంతీయ బేధాల ఊసు లేకుండా ఒంటి చేత్తో నిర్వహించారు.

ఈ సంవత్సరం రజతోత్సవ సంవత్సరం కావడంతో మరో ఇరవై మంది కథకులను అదనంగా కలుపుకుని అరవై మందితో ఈనెల 14,15నసాధారణ సాహితీ కార్యక్రమాల మూసపద్ధకి భిన్నంగా వ్రాతపూర్వకంగా ఎటువంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా ఆరంభం నుండి ముగింపువరకు ఆసు కవిత్వం చెప్పే కవి అప్పటికప్పుడు సందర్భోచితంగా పద్యం చెప్పినట్టు, సమయపాలనను ఖచ్చితంగా పాటిస్తూ..రచయితల పరిచయం తరువాత కథారచనల్లో వస్తున్న మార్పులు మీద, ఏండ్ల తరబడి పుస్తక విక్రేతలుగా కొనసాగుతున్నవారిలో కొన్ని సంస్థలవారు రచయితకు చేస్తున్న అన్యాయాల మీద, అనువాద సాహిత్యం మీద, కొత్తగా పుస్తక ప్రచురణ రంగంలోకి వస్తున్న యువతరం (ముఖ్యంగా బాగా చదువుకుని వస్తున్న యువతరం) అభిరుచుల మీద, తెలుగు సాహిత్యంలో విమర్శ ప్రక్రియ ప్రస్థానం మీద, పాఠకుల సంఖ్యను పెంచడం ఎలా? అన్న విషయం మీద, సాహిత్యంలో సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకోవడం మీద, సాహిత్యంలో ప్రాంతీయం అస్థిత్వాల తీరు తెన్నుల మీద నలుగురు నలుగురు కథకులను వేదిక మీదికి పిలిచి పదిహేను నుండి ఇరవై నిమిషాల వ్యవధిలో విలువైన చర్చలు కొనసాగించడాలు ఖదీర్ బాబు నిర్వహణా దక్షతకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఖదీర్ నిర్వహించిన ఈ మొత్తం కార్యక్రమంలో ఓ యుద్ధ భూమిలో సేనాధిపతి చెప్పిన పనిని చెప్పినట్టు చేసుకొచ్చే సుశిక్షితులైన చతురంగ బలాల సైనికుల వంటి ఉత్సాహవంతులైన ఎనిమిది మంది యువ కథక సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వాళ్ళంతా బాగా చదువుకున్నవాళ్ళు, సినీ, టివి, ఐటి రంగాల్లో పనిచేస్తున్నవారు. అయినప్పటికీ వారు రెండు రోజుల పాటు ప్రతిపనినీ తమ ఇంటి ఆడపడుచు పెండ్లికి కష్టించే అన్నాతమ్ములు, అక్కాచెల్లెళ్ళ మాదిరిగా తమ భుజాల మీద వేసుకుని చేయడం ఎంతో అభినందనీయంగావుంది.

తెలుగు కథా సాహిత్యానికి వివిధ కోణాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు సన్మానాలతో రెండు రోజులు రెండు గంటల్లా గడిచి పోయాయి.

ప్రణాళికా బద్ధంగా జరిగిన ఈ రెండు రోజుల సాహిత్య కార్యక్రమానికి తలామానికంగా 14న సాయంత్రం విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో శ్రీమతి యశోదా ఠాకూర్ గారు కళావంతుల నృత్యం తాలూకు చరిత్రను ఆంగ్లాంధ్ర భాషల్లో సకృత్తుగా వివరిస్తూ ప్రదర్శించిన తీరు అమోఘం అప్రమేయం.

మనకా లం వారం ఎరుగని ఆ నృత్యాన్ని, దాన్ని ప్రదర్శించిన ఆనాటి స్త్రీల జీవితాల పట్ల ఈనాటికీ సమాజ ంలో చిన్న చూపును, ఏహ్యతనూ మాత్రమే ఎరిగిన మన కళ్ళు బైర్లు కమ్మేలా విశదపరిచిన విదుషీమణి యశోదా ఠాకూర్ కి వినమ్రంగా నమస్కరించడం తప్ప మనం ఏమివ్వగలం?.

తెలుగు సాహితీ యవనిక పైన కుమార్ కూనపరాజు అన్న పేరును, ఆ వ్యక్తినీ ఎరుగనివారు బహుశః లేరంటే అతిశయోక్తికాదేమో!?. తను వ్యక్తిగా ఎంత సౌమ్యుడో, సాహితీ వ్యాసంగంలో తను తలపెట్టిన ఎంతటి కష్టపూరితమైన పనినైనా సాధించడంలో అంతటి ప్రచండ రాక్షసుడనడంలో కూడా అతిశయోక్తి లేదు.

ప్రస్తుతం ప్రపంచ మానవాళిని వణికిస్తున్న క్యాన్సర్ మహమ్మారి బారినపడిన తను తీసుకుంటున్న వైద్యంలో ముఖ్యభాగమైన కిమో థెరపీని అంపశయ్య మీది భీష్మని మాదిరిగా సహిస్తూనే బెడ్ మీద వుండి ప్రఖ్యాత కిర్గిస్థాన్ రచయిత చింగీజ్ ఐత్మతోవ్ రచించిన "కొంగలు ముందే ఎగిరాయి" అన్న రష్యన్ నవలను తెలుగులోకి అనువాదం చేశారు. ఆ అనువాద కార్యక్రమాన్ని చేపట్టడం కారణంగానే తన అక్షరాలే శరాలుగా మారి క్యాన్సర్ మహమ్మారి మీద తను సాగించిన పోరాటంలో, సాధించిన విజయానికి ప్రతీకే ఈ పుస్తకావిష్కరణ సభ అన్న విషయాన్ని వారు వివరించినప్పుడు సభలోని వారంతా భావోద్వేగతకు లోనయ్యారు.

ఈ కార్యక్రమంలో కోడూరి విజయకుమార్ (రచయిత), ఇండ్ల చంద్రశేఖర్ (రచయిత), నాగిని అప్పన్న (అనువాదకురాలు), లక్ష్మీ నరసింహ (రచయిత), శ్వేత (పబ్లిషర్), కె.ఎన్.మల్లీశ్వరి (రచయిత), శ్రీఊహ (రచయిత), అరవింద్ (రచయిత), స్వర్ణ కిలారి (రచయిత), పూడి శ్రీనివాస్ (రచయిత), అనిల్ డేని (రచయిత), రఘు మందాటి (రచయిత),కృష్ణసాహితి (రచయిత), యశోదా ఠాకూర్ (నృత్యకారిణి), రజని (తెలుగు శాఖ–అంబేద్కర్ యూనివర్సిటీ), ఉషారాణి (అనువాదకురాలు), పద్మావతి బొడపాటి (విమర్శ), ఖదీర్‌బాబు (రచయిత), ఎల్.వి.కె.రెడ్డి (రిజిస్ట్రార్, అంబేద్కర్ యూనివర్సిటీ), ఘంటా చక్రపాణి (వైస్ చాన్సలర్, అంబేద్కర్ యూనివర్సిటీ), బి.ఎస్.రాములు (రచయిత), సతీష్‌చందర్ (రచయిత), అనిల్ అట్లూరి (రచయిత), చిలుకూరి ఉమా మహేశ్వర శర్మ (రచయిత), వాసిరెడ్డి నవీన్ (కథ–సంపాదకుడు),రఘాన్నీ పాపుదేశి (రచయిత), ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు (రచయిత), ఎం.ఎస్.కె.కృష్ణజ్యోతి (రచయిత), శారద కావూరి (రచయిత), మాధవి (పాఠకురాలు), యశోదా ఠాకూర్ టీమ్‌మేట్, తాడి ప్రకాష్ (విమర్శ), పసునూరి రవీందర్ (రచయిత), పూడూరి రాజిరెడ్డి (రచయిత), కుప్పిలి పద్మ (రచయిత), అజహర్ (రచయిత), విజయరామరాజు (చదువరి), జి.లక్ష్మి నరసయ్య (విమర్శ), కృష్ణమోహన్‌బాబు (పబ్లిషర్), శిరంశెట్టి కాంతారావు (రచయిత), నన్నపరెట్టి వెంకటరామిరెడ్డి (రచయిత), ఖాన్ యజ్దానీ డేనీ (విమర్శ), జి.ఎస్.చలం (రచయిత), శేషు హనుమంతరావు (ఆడియో స్టోరీటెల్లర్), హర్షణీయం కుమార్ (అనువాదం), శ్రీనివాసమూర్తి (రచయిత), జి.ఎస్.రామ్మోహన్ (విమర్శ), బి.అజయ్ ప్రసాద్ (రచయిత), మధురాంతకం నరేంద్ర (రచయిత), రమణమూర్తి (కథ– సహ సంపాదకులు), అయోధ్యారెడ్డి (రచయిత), జి.వెంకటకృష్ణ (రచయిత)ప్రసాద్ సూరి (రచయిత), శ్రీదివ్య (పబ్లిషర్), నాగార్జున్ వలేరు (రచయిత), సాయి వంశీ (రచయిత), భవానీ శంకర్ (రచయిత), సురేంద్ర శీలం (రచయిత), అవినేని భాస్కర్ (అనువాదం), తేజ గుడికందుల (రచయిత), ఎన్.వేణు (విమర్శ), పులగం చిన్నారాయణ (సినీ విమర్శ), శివ నాగేశ్వరరావు (దర్శకులు), కుమార్ కూనపరాజు (రచయిత), కె.శ్రీనివాస్ (విమర్శ), చైతన్య పిన్నమరాజు (రచయిత), హనీఫ్ (రచయిత), జి.ఉమామహేశ్వర్ (రచయిత), నరేశ్ కుమార్ సూఫీ (రచయిత), యుగంధర్ (తెలుగు శాఖ–అంబేద్కర్ యూనివర్సిటీ), కరుణకుమార్ (రచయిత), మహి బెజవాడ (రచయిత), అనంతు చింతలపల్లి (విమర్శ) పాల్గొన్నారు

హాజరైన కథకులందరికీ జ్ఞాపికలు అందజేయడంతో రెండు రోజుల రైటర్స్ మీట్ ముగిసింది.

# జీవితంలో విలువలు పాటించాలి

## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



ప్రముఖ సాహితీవేత్త డా॥జనువాడ రామస్వామి రచించిన 'డమరుకం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ. వేదికపై మట్టిగుంట వెంకటరమణ, సుధామ, విహారి తదితరులు



డా॥ జెనువాడ రామస్వామి దంపతులను సత్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మట్టిగుంట వెంకటరమణ, సుధామ, విహారి, డా॥ గోపీనాథ్ రెడ్డి తదితరులు.

హైదరాబాద్, మార్చి 17 (నేటినిజం ప్రతినిధి):మనిషి జీవితంలో విలువలు పాటించడం తప్పనిసరి అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో యం.వి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డా॥జనువాడ రామస్వామి రచించిన **'డమరుకం'** పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితలను అభినందించారు. ఈ సందర్భంగా తొలి కాపీని డాక్టర్ లక్ష్మీకాంతకు అందజేసి ఆయనకు అంకితం చేశారు. గోపాలకృష్ణ, విహారి, డా॥సి.ఎన్.గోపినాథ్ రెడ్డి, సుధామ, అజయ్ మిశ్రా, బండారు విజయలక్ష్మి, డాక్టర్ ధనశ్రీ నాయుడు, వెంకటరమణ, మార్కండేయులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ శంకర నారాయణకు గాన సభ ఉగాది పురస్కారం

హైదరాబాద్, మార్చి 17: ప్రముఖ జర్నలిస్ట్ హాస్యవధాని శంకర నారాయణ కు సామాజిక సేవా కార్యకర్త నీల విజయ బాబు కు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాబోయే పరాభవ నామ ఉగాది పురస్కార ప్రదానం సభ జరిగింది. ముఖ్య



ప్రముఖ జర్నలిస్ట్ హాస్యవధాని శంకర నారాయణ, సామాజిక సేవా కార్యకర్త నీల విజయ బాబులను సత్కరిస్తున్న రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి. వేదికపై డా॥ కళా జనార్ధనమూర్తి, చక్రపాణి

అతిథిగా పాల్గొన్న రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి పాల్గొని పురస్కార ప్రదానం చేసి మాట్లాడారు శంకర నారాయణ ప్రముఖ దిన పత్రికలో కాలమిస్ట్ గా రాజకీయాలపై వ్యంగాత్మక వ్యాసాలు రాసి చదువరులకు ఆలోచన రేకెత్తిస్తున్నారనీ పేర్కొన్నారు జర్నలిస్ట్ గానే కాక ఆయన హాస్యవధానం ప్రత్యేక సాహితీ రూపకం తో దేశ విదేశాలలో ప్రదర్శన లిచ్చి ప్రశంసలు అందుకున్న గొప్ప సాహితీ వేత్త అని అభినందించారు. నీలా విజయ బాబు అవసరం వున్న వారికి సహాయ కారిగా అధ్యాత్మిక భావన కలిగిన వారు అని ప్రశంసించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాన సభ పాలక వర్గ సభ్యులు బండి శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు


**ఆహ్వానం**

**కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ**

యానాం – హైదరాబాద్

**భాషా సాంస్కృతిక శాఖ,** తెలంగాణ ప్రభుత్వం

సంయుక్త నిర్వహణలో

**ప్రపంచ కవితా దినోత్సవం -2026**

22 మార్చి 2026 ఆదివారం, సా.5.30కి రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలు

కవిసంధ్య - సుధామ కవితల పోటీ బహుమతుల ప్రదానం
తెలుగులో యుద్ధ కవిత్వం పై ప్రత్యేక ప్రసంగం
కవిసంధ్య-59 - చందు సుబ్బారావు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ముఖ్య అతిథి: **శ్రీ కె. శివారెడ్డి,** సరస్వతి సమ్మాన్ అవార్డు గ్రహీత

గౌరవ అతిథి: **శ్రీ జింబో (మంగారి రాజేందర్)** జిల్లా జడ్జి, రిటైర్డ్

సభాధ్యక్షులు: **డా.శిఖామణి,** కవిసంధ్య సంపాదకులు

విశిష్ట అతిథి–కవిసంధ్య–59, చందు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ:
**డా.ఏనుగు నరసింహారెడ్డి,** ఐఏఎస్
డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం

బహుమతుల సౌజన్యం: **శ్రీ సుధామ,** ప్రముఖ కవి, రేడియో ప్రయోక్త

కవితల పోటీ నివేదిక: **కళారత్న దాట్ల దేవదానం రాజు,** పోటీల కన్వీనర్

ప్రత్యేక ప్రసంగం: **ఆచార్య కోయి కోటేశ్వరరావు,** ప్రముఖ కవి, విమర్శకులు
అంశం: తెలుగులో యుద్ధ కవిత్వం

ఆత్మీయ అతిథులు:
**శ్రీ సన్నిధానం నరసింహ శర్మ,** ప్రముఖ సాహితీవేత్త
**శ్రీమతి శీలా సుభద్రా దేవి,** ప్రముఖ కవయిత్రి
**శ్రీ యార్లగడ్డ రాఘవేంద్ర రావు,** ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్
**శ్రీ సి.ఎస్.రాంబాబు,** ప్రముఖ కవి రేడియో ప్రయోక్త
**డా.జి.వి.రత్నాకర్,** ప్రముఖ కవి, మౌలానా అజాద్ కేంద్రీయ ఉర్దూ యూనివర్సిటీ.
**శ్రీ పి.శ్రీనివాస్ గౌడ్,** ప్రముఖ కవి, అనువాదకుడు

ఆహ్వానం: **శ్రీ చల్లా రామఫణి,** ప్రముఖ కవి


సభాసమన్వయం: **శ్రీ అరిగెల రాజు,** కవిసంధ్య హైదరాబాద్ కన్వీనర్

దాట్ల దేవదానం రాజు, కన్వీనర్, పురస్కార కమిటీ, 9440105978
శిఖామణి, అధ్యక్షులు, కవిసంధ్య, 9848202526


## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### వసంతమా స్వాగతం

శిశిరపు రాలిన పర్ణాల మర్మర ధ్వనుల చెంత
ఆమని కుహూ రాగాల అమృత పల్లవివై
మంచు తెరల మాటున నిదురించిన ప్రకృతికి
నవ చైతన్యపు మేలుకొలుపువై.. వసంతమా స్వాగతం!.
-మోడువారిన కొమ్మల హృదయ గీతికలో
లేత చిగురుల పచ్చని తోరణమై
మామిడి పిందెల పులుపు.. వేపపూత చేదుల నడుమ
షడ్రుచుల జీవిత సత్యమై సాక్షాత్కరించే కాలమా స్వాగతం.

వాడిపోయిన ఆశల వనవాటికలో
అనురాగ మకరందపు జల్లులను కురిపిస్తూ
మలయమారుతపు మృదువైన స్పర్శతో
అవనిని పరవశింపజేసే సౌందర్యమా స్వాగతం.

-నువ్వు అడుగుపెట్టిన ప్రతి ఇంటా.. ప్రతి మదిలో..
మమతల మల్లెలు వికసించి, విద్వేషపు మంటలు ఆరాలి..
వచ్చేడి నూతన వత్సరానికి మంగళాశాసనమై
నవ వసంతమా నీకు ఇవే మా సుమస్వాగతాలు!!

**-కోట్ల గౌతమ్**
నాగర్ కర్నూలు జిల్లా.తెలంగాణ

### సంతసాన సందడిచేయుమా

శిశిరాలు పల్లవించిన చిగురుల
తోరణాలు కట్టుకుని
మల్లెలు,మొల్లలు
జాజులు, విరజాజులతో
విరబూసి మురిసిన విరుల వనం
సంతసాన వసంతునికి
స్వాగతం పలుకుతోంది.
తరువులు పల్లవించిన
లేచివురులు ఆరగించుచూ
గున్నమావి గుబురుల దాగి
సన్నాయి ఋతురాగాలు
ఆలపిస్తోంది కోయిలమ్మ
కులుకు పలుకుల చిలుకమ్మలు
కొమ్మ కొమ్మల తిరుగుతూ
సందడి చేస్తున్నాయి .
పూవింటి సుమశరుడు
కొత్త పెళ్ళికొడుకై వచ్చి
ఆమని భామపై
మరుల విరుల శరాలు సంధిస్తూ
అల్లరి చేస్తున్నాడు.
కొత్త సంవత్సరంలో
అత్తారింట అడుగుబెట్టాలని
ఆమని భామ ఆత్రంగా
ఎదురుచూస్తోంది
శుకపికముల కలరవముల
విరుల పరిమళాలతో
వసంతమా నీకిదే
స్వాగతం సుస్వాగతం

**-కొలచన విజయ భారతి**

### సాదర స్వాగతం

ఆమని అందాలకు స్వాగతం
పలుకుతున్న ఫాల్గుణం..
శివ పార్వతులను,
ప్రియసమాగమం
చేసిన కామదహనం...
కుమార సంభవానికి పలికింది
నాందీ ప్రస్థానం...!.
శిశిరానికి వీడ్కోలు పలికి
మోడువారిన తరువులకు
చిగురు పూలగుత్తులను
బహుకరిస్తూ,
ప్రకృతికాంతను ఇంద్రధనుస్సు
రంగులతో ముస్తాబు చేసే,
వసంతాగమనపు పలకరింతకు
ఉలిక్కి పడిన కోయిలమ్మ...
కొమ్మ కొమ్మలో మావి చిగురులు
ఆరగిస్తూ, పాడుతోంది
మధురమైన స్వాగత గీతాలు...!.
మల్లె,జాజి,మత్తైన పరిమళాలు
చిలకరిస్తుంటే
మామిడాకు
తోరణాలతో సంబరంగా
డోలలూగుతున్న
తెలుగు వాకిళ్ళు
ముత్యాలముగ్గుల శోభతో
మురిసే, కళ్ళాపి చల్లిన వాకిళ్ళు
ఇలపై,హర్షోల్లాసం
పంచేందుకు వచ్చే
వసంతానికి, పిండి వంటల
ఘుమఘుమలతో,
పంచాగ శ్రవణ,
కవి సమ్మేళన సత్కారాలతో,
షడ్రుచుల ఉగాది పచ్చడి
పలుకుతోంది సాదర స్వాగతం..!.
నవరసాలను మనిషిలో నింపి
ఆరు రుచులను జిహ్వాకు పంచి
ఆరోగ్యాల హంగులు పెంచే
ఋతురాజు రాకకై, భువి ఎదురు
చూస్తోంది అభిసారికలా...!

**-సావిత్రి రంజోల్కర్,**
నవీముంబై.

### ఉగాది ఉత్ప్రేరకం

ఉగాది వచ్చింది ఉత్సాహాన్ని తెచ్చింది మరి
ఉన్మేషనిమిషోత్పన్న విపన్నభువనావళి"అని స్తుతిస్తే తప్ప
ఉత్తినే దొరకనిది జయం
ఉరకలు వేసే ఉత్సాహంతో ఉప్పొంగే ఉల్లముతో
ఉత్తేజంతో ఉయ్యాల జంపాలలతో ఓలలాడాలంటే
ఉదయ.. సంధ్యవేళల నియమాలు ఉల్లంఘించక
ఉక్రోషాలు ఉత్తుత్తి మాటలకు ఉప్పుపాతర వేసి
ఉమ్మడి అనే పదాలనే ఉపయోగిస్తూ
ఉష్ణం ఉష్ణేణ శీతలం"అని ఉత్తమ ప్రతిభ ఉత్తమ లక్షణాలు
ఉన్నత ఆశయాలతోనే ఉత్కృష్ట స్థానం లభ్యం కాబట్టి
ఉగాదినాటి ఈ ఉత్తమ పదాలను యుగ+ఆది యుగాదినాడే కాక
ఉన్నంతకాలమూ యుగాంతం వరకు
ఉభయ భాషా పండితుల కవి సమ్మేళనాల్లో ఆలకించి వదిలేయక
ఉరకలు వేసే ఉత్సాహంతో "జయం"
ఉత్సాహం రంకెలు వేస్తే "అపజయం"అని గ్రహించి
ఉత్తమ అవగాహకులుగా మారి
ఆచరణపరులను ఉత్పన్నం చేయాలని
ఉన్నంతలో మంచిని ఉద్భవింపజేయాలనిఉద్దేశాలను నిర్దేశిస్తూ
"పరాభవనామ" ఉగాది శుభాకాంక్షలతో...

**-ఉండవిల్లి సుజాతా మూర్తి,** 93472 48428

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### హరివిల్లు అందం

మంచు తెరలని చీల్చుకుని
కొండ కోనలు దాటి
నురగలు చిమ్మే జలపాతం
నేల అంచున చేరాలని
చేసే గలగలమని చిరు సవ్వడి.
ఆ కొండకోనల్లో పచ్చని ఆకులు
ఆకుపచ్చని రంగుల సవ్వడి
తెలుగులోమేను సిగారింపు
పక్షుల కిలకిల రావాలని నడుమ
ప్రకృతి పచ్చదనం తో మెరవగా.
నింగిని తాకిన జలపాతాల
నీటి బిందువులు
ఆకాశంలో ఎర్రని సూర్యుడు సైతం
స్నానమాడగా
తన గ్రీష్మ తాపాన్ని మరచి
కోన అందాలకు ముగ్ధుడై
తనలోని ఏడు రంగులను
హరివిల్లుగా మార్చెను
ఆ ఆకాశానికి హరివిల్లు అందం
అవనిలో ఉప్పొంగె ఆనందం
చూసిన నా మనసుకు చల్లని చందనం
ప్రకృతి కి వరం హరివిల్లు చందం
కొండ కోనలకి సైతం ప్రియ నేస్తం

**-రాధ ఓడూరి**
సెల్:78939 23966

### రేపటి భారతం

నిత్యం సమస్యల వలయం
జనజీవనం అస్తవ్యస్తం
పొంచి ఉన్న యుద్ధం
మానవాళి మనుగడ శాపం
ఎటు చూసినా, ఎటు పోయినా
ప్రమాదకర వర్ణ ఎర్రదనం
విలువ లేకపోయెనే మనిషి ప్రాణం
తీయాలన్నా, ప్రాణం ఇవ్వాలన్నా లక్ష్య రహిత కర్మణం
జనక్షేమం ఆలోచించే సగటు మనిషి లేని వైనం
యుద్ధం ఫలితం సర్వనాశనం
గెలుపు ఓటములు అవసరం లేదు, దుఃఖం మాత్రం స్మరణం
బ్రతికేయడం కాదు, ఉండాలి జీవించనివ్వాలనే సులోచనం
ఎన్నెన్నో యుద్ధాలు, కారణం మాత్రం ఆర్థిక మధనం
ప్రోగు చేసుకుని ఏలాలనుకునేటి మొహంజదారో ఖననం
మొదటి, రెండు ప్రపంచ యుద్ధాలు మిగిల్చిన తీవ్ర విషాధ బాధారణం
మూడో ప్రపంచ యుద్ధం కోసం వద్దనే వద్దు తాపత్రయం
రేపటి చరిత్ర రాయటానికి ఎవడు మిగలని భవిష్యత్తు విశ్వ కరణం
పని చేస్తే ఆకలి, కుటుంబానికి క్షేమకరం
పని లేకుంటే బుర్ర పాడై, వచ్చేటి విధ్వంసం హానికరం
ఇదే ఆలోచన ఒకరికి ఒకరు తోడై, కలిసి ఉంటే మనోహర మానవహారం
ప్రపంచ శాంతికి నడుం కడితే, అంకురించేటి సత్య, స్వచ్ఛభారత చిత్రీకరణం

**-కె. వి. వి. సత్య ప్రసాద్,**
7396301014

### చెబితే వినాలి

చిన్న తనం నుండే మంచీ చెడు ఒప్పు తప్పు పిల్లలకు నేర్పాలి
సొంతంగా అన్నీ తెలుసుకోవడానికి మన జీవితం సరిపోదు.
ఇతరుల పొరబాట్లనుండి ఎలా పాఠాలు నేర్చుకోవాలీ అనేది అర్థమయేలా వివరించాలి.
దయ కరుణ అలవరచాలి ముఖ్యం గా పాపభీతి భూతదయ పెంపొందించాలి.
ఏ జంతువు నైనా మనిషి నైనా బాధ పెడితే తనవంటి నొప్పే వారికీ కలుగుతుందని గ్రహించేలా చేయాలి.
ఎంచి తనవలె నొరుల ప్రేమించు మనసు కలిగి వుండాలని నూరి పోయాలి.
మరీ ముఖ్యం గా పెద్దలను గౌరవించాలనీ వారి యెడల వినయ విధేయతలతో మెలగాలని నేర్పాలి.
గురువంటే జ్ఞానదీపమని తన భవిష్యత్తుకి వెలుగు బాటలో నడిపేవాడనీ ఎరుక పరచాలి.
నేడు తోచిందే రైటనీ ఫ్రెండ్స్‌నే గొప్పని ఇంట్లో వారికంటే బైటవారితోనూ స్నేహితులతోనూ ఆన్లైన్‌లోనూ గడిపేవారే నేటితరం లోఎక్కువ మందీ
అమ్మానాన్న లు పెట్టి పోషించడానికే
గురువంటే హాజరేసి విన్నా వినకున్నా
తన పోర్షన్ తను చెప్పుకుని పోయేవాడే.
తలిదండ్రుల తప్పుకూడా వుంది ఏక సంతానమూ అతి గారాబముతో పిల్లలను చేతులారా చెడగొడుతున్నారు.
అందుకే మొక్కై వంగనిది మానై వంగుతుందా అంటారు
ఇలాంటి పిల్లల వల్లే పెద్ద వారు వృద్ధాశ్రమాల పాలవుతున్నారు
పెంచి పోషించిన అతి గారాబంతో
లెక్క లేనితనం పెచ్చుమీరిపోయింది
క్రమశిక్షణ లేకపోవడడం వలనే ఇదంతా జరుగుతుంది
ఒకప్పటి తో పోలిస్తే ఇప్పుడంతా కృతకం నేతిబీర చందం
దానికి తోడు విపరీతమైన స్వేచ్ఛ చేతికందుతున్న
శ్రమలేని డబ్బు ఎంత డబ్బు పిల్లల చేతికిస్తే అంత గొప్ప
పాకెట్ మనీ తో వాళ్ళు ఏంచేస్తున్నారో ఎలా వాడుతున్నరో పట్టించుకొనే తీరిక ఓపిక సమయమూ నేటి పేరెంట్స్‌కి లేదు
ఖరీదైన బండి బట్టలు సమకూర్చిపెట్టడంతో
తమ పనైపోయిం దనుకుంటున్నారు
ఆ డబ్బు తో చెడుసావాసాలు మత్తు మందులకు బానిసలై పోతున్నారు యువత
డ్రగ్స్ అలవాటై మనీ సరిపోక దొంగతనాలు మరుగుతున్నారు
కేవలం తలిదండ్రుల పర్యవేక్షణా లోపం ఎవరి పిల్లలను వారు అదుపులో పెట్టుకోగలిగితే ఇన్ని అనర్థాలు జరిగి వుండేవి కాదు
ఎవరు తీసుకున్న గోతిలో వారే పడుతున్నారు వాళ్ళ పిల్లలనూ పడేస్తున్నారు
..తల్లిదండ్రులూ ఆలోచించండి...

**-ఎ. విక్టోరియా రాణి**

### ఇంటి లొల్లి

ఇందుగలదందు లేదని సందేహము వలదు
ఎందు జూసినా సమస్యలుండే
ఇంటి నుండి మింటి వరకూ..
ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు...
ఇంట సమస్యలు ఇంతింత గాదు...
పైగా ఇల్లాలి సమస్యలు చెప్ప నలవి గాదు..
పతి దేవుడు కొడుకులూ కోడళ్ళు,మనవాళ్ళు
మనవరాళ్లు ఒక్కోరు ఒక్కోతీరు..
ఎవరూ పెద్దల మాటలు వినరు...
ఒక్కోరు ఒక్కో వంటలు కోరేరు
తీరా చేస్తే నచ్చడం లేదని తెప్పించుకు తినేరు..
వండింది పడేయ లేక
ఫ్రిడ్జ్ లో పెట్టి ఇల్లాలు తినాల్సిందే...
ఉదయాన్నే నిద్ర లేచే అలవాటు ఒక్కడికి ఉండదు.
ఎవరికి ఎప్పుడు తెల్లారు తుందో తెలియదు..
అది మంచి పద్ధతి కాదంటే..
"నీవు ఎందుకు లేస్తావు త్వరగా...
ఏం చేస్తావు లేచి..అంటారు..
బయటి గడ్డి తినేది.. అరగ దానికి జిమ్ ల వెంట పడేది..సహజ నడకలు,వ్యాయామాలు పనికి రావు..
వయస్సు పై బడి ఒళ్ళు నొప్పులంటే..
"నీకు ఎక్సర్సైజ్ లేదంటారు...నీ వయస్సు వాళ్ళు జిమ్ కు వస్తారు..అంటారు...
తాతకే దగ్గు నేర్పేరు నేడు
పిల్లలు..
కమ్మగ పప్పు నెయ్యి రసం ,సాంబార్ పెడితే..."ఏం ఫుడ్ ఇది..అంతా కొలస్ట్రాల్ అంటారు...
అందుకే నీకు బలం లేదంటారు..
రుచీ పచీ లేని సారం లేని గడ్డీ గాదెం తింటారు...
ఏమిటో నేటి పిల్లల జీవన పద్ధతులు...
చెప్పుతూ పోతే ఇంటి లొల్లి ఇంతింత గాదు..
చెప్పినా తీరేవి గాదు...
రావణ కాష్టమే ఇది..
ఇల్లే ఇంత ఉంటే..లోకం కథ చెప్పాలా...
నీటి లోని చేప ఈదక మానేనా..
మనిషి సమస్యలను ఎదుర్కొనక తప్పేనా...
జీవితం ఇంతే...

**-నంద్యాల సరస్వతి**
సెల్:9490482795


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com